సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
సోమవారం, 19.10.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 349
పేజీలు: 08 వెల: రూ. 5



ఘనంగా ముగిసిన పెద్ద బతుకమ్మ

తీరొక్క పూలతో బతుకమ్మలు

ఐదు రకాల సద్దులతో అమ్మవారికి నైవేద్యం

పూలతో మమేకమైన ఆడపడుచుల జీవనం

బతుకమ్మ నిమజ్జనం

ప్రకృతిని ఆరాధించే అరుదైన సన్నివేశం

సద్దుల సంబురం

సంస్కృతి వైభవం



ముద్ర, తెలంగాణ బ్యూరో :
తీరొక్క పూలతో బతుకమ్మల పేర్పు.. సంప్రదాయ దుస్తుల్లో ఆడపడుచుల ఆటపాటలు.. ఐదు రకాల సద్దులతో గౌరీదేవికి ప్రత్యేక నైవేద్యాలు.. చెరువుల వద్ద కోలాహలం.. భక్తిశ్రద్ధలతో బతుకమ్మల నిమజ్జనం.. ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ వ్యాప్తంగా సాగిన సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా ముగిశాయి.

తెలంగాణ అంతటా పండుగ శోభ..

తెలంగాణ నేలను పూల పరిమళాలతో పరవశింపజేసిన బతుకమ్మ సంబరాలు వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజులుగా 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ పల్లెలు, పట్టణాల్లో మారుమోగిన పాటలు ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలతో మరింత ఉత్సాహాన్ని నింపాయి. ప్రకృతిలో లభించే రకరకాల పూలను సేకరించి, వాటిని అందంగా పేర్చి బతుకమ్మలను సిద్ధం చేసిన మహిళలు.. సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు. గౌరీదేవిని కొలుస్తూ, కుటుంబాలు సంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తూ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. **మిగతా 02లో**



ట్యాంక్‌బండ్‌పై సద్దుల

బతుకమ్మ శోభ

మహా బతుకమ్మలతో అంగరంగ వైభవంగా ర్యాలీ

700 మంది కళాకారులతో జానపద ప్రదర్శనలు

బతుకమ్మ వేడుకలకు గవర్నర్, మంత్రులు

ప్రత్యేక ఆకర్షణగా విజయ్-రష్మిక

హుస్సేన్‌సాగర్ తీరంలో లేజర్ షో.. ప్రత్యేక ఫైర్‌వర్క్స్




మృతుల కుటుంబాలకు

ప్రభుత్వ ఉద్యోగాలు

కోల్‌కతా తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నిర్ణయం

- బాధితులకు అమిత్ పరామర్శ
- 19కి చేరిన మృతుల సంఖ్య
- నిర్వాహకులు సహా ఏడుగురి అరెస్టు
- సంతాపం వ్యక్తంచేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- ఆస్పత్రిలో బాధితులను పరామర్శించిన కేంద్ర మంత్రి



02

హద్దులు దాటి

మాట్లాడాను

భారత్‌పై వ్యాఖ్యలకు జేడీ వాన్స్ పశ్చాత్తాపం

- హెచ్-1బీ వీసాపై వాన్స్ కీలక వ్యాఖ్యలు
- భారతీయులపై వ్యాఖ్యలకు వెనక్కి
- నా మాటల్లో తప్పంటే నాదే బాధ్యత: వాన్స్



02

తగ్గేదే లే..!

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

శాంతియుత నిరసనలపై ఉక్కుపాదమా?

ప్రజల అండతో చివరి వరకూ పోరాటం

కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే

ముద్ర, న్యూఢిల్లీ :
అక్రమ అరెస్టులు, పోలీసు నిర్బంధాలతో తమను మానసికంగా భయపెట్టాలని చూస్తున్నారని, అయితే ఇలాంటి చర్యలకు తాము ఎంతమాత్రం భయపడబోమని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు తాము చేస్తున్న పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. ఇటీవల కండిషనల్ బెయిల్‌పై విడుదలైన ఆయన ఢిల్లీలో మీడి యాతో మాట్లాడుతూ.. తమ ఉద్యమాన్ని అణచివేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు లొంగిపోయే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. అలాంటి నిరసనలపై అధికార యంత్రాంగం ఉక్కుపాదం మోపాలని చూడటం దారుణమని వ్యాఖ్యానించారు. అరెస్టులు, నిర్బంధాలు, బెదిరింపుల ద్వారా ఉద్యమకారులను వెనక్కి తగ్గించాలని ప్రయత్నించినా తమ లక్ష్యం నుంచి పక్కకు తప్పుకోబోమని వెల్లడించారు. ప్రజల మద్దతుతో న్యాయస్థానాల ద్వారా తమ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు.

సహచరుల విడుదలపై ఆశాభావం

తమ ఉద్యమ సహచరులైన సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ఇవాళ అధికారికంగా విడుదల అవుతారని **మిగతా 02లో**

భయపడేది లేదు..



ఆహార భద్రతపై FSSAI కఠిన నిబంధనలు

- ఆహార రవాణాలో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే
- ఫుడ్ గ్రేడ్ ప్యాకేజింగ్ వాడాలి.. నాసిరకం కవర్లకు చెక్
- ఆహార కల్తీ నివారణకు పక్కా రికార్డుల నిర్వహణ
- FSSAI నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

కోవా, పన్నీర్, మాంసం నిల్వలో నిర్దేశిత ఉష్ణోగ్రతలు తప్పనిసరి



02

చైనా ఏజెంట్లకు దేశ రహస్యాలు

చేరవేసిన తెలంగాణ ఆర్మీ ఆఫీసర్ భార్య

- విద్యావేత్తల ముసుగులో నిఘా వల!
- ఎన్‌క్రిప్టెడ్ ఛానెళ్ల ద్వారా సమాచారం?
- కీలక పత్రాలు, ఫొటోలు పంపినట్లు అనుమానాలు
- జమ్మూలో సంచలనం.. ఎఫ్ఐఆర్ నమోదు!
- తెలంగాణ మహిళపై తీవ్ర ఆరోపణలు!
- విదేశీ వ్యక్తులతో సంబంధాలపై పోలీసుల ఆరా



06

ముగిసిన నామినేషన్లు

చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు

- దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది వైసీపీ అభ్యర్థులు వెనుదిరిగిన వైనం
- అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్
- అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి



02

పండుగ సంబరం లేకుండా చేశారు

పండగ స్పెషల్ బస్సుల ఛార్జీల పెంపు

- సాధారణ బస్సులనే స్పెషల్ గా నడుపుతున్నారు.
- టికెట్ ధరలు పెంచి ప్రయాణికుల నడ్డి విరిచారు
- ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్..
- స్పెషల్ బస్సులపై 50% సర్ చార్జి మాత్రమేనంటున్న టీజీఎస్ఆర్టీసీ




02

ట్రాయ్ దెబ్బకు దిగొచ్చిన ఎయిర్ టెల్..

కేవలం కాల్స్, ఎస్ఎంఎస్‌ల కోసం కొత్త రీఛార్జ్ ప్లాన్లు

- రూ.185 నుంచే ఎయిర్‌టెల్ రీఛార్జ్‌లు
- ట్రాయ్ ఆదేశాలతో దిగొచ్చిన ఎయిర్‌టెల్
- డేటా అవసరం లేనివారికి బంపర్ ఆఫర్
- 28 రోజులు, 30 రోజుల వ్యాలిడిటీతో ప్లాన్లు



02

ఇదీ AI ముద్ర

వచ్చే ఫిబ్రవరి నుంచే మండే ఎండలు.. ఏసీలతో ప్రపంచ వ్యాప్తంగా మరింత పెరగనున్న భూతాపం



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
సోమవారం, 19 అక్టోబర్, 2026

విటమిన్ బి12తో నరాల ఆరోగ్యానికి మేలు!

మేక మాంసంలో ఉండే విటమిన్ బి12 నరాల పనితీరుకు, ఎర్ర రక్త కణాల తయారీకి అవసరం. అయితే నరాల బలహీనతకు వట్టి తునకలే పరిష్కారం కాదు. అలాంటి సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.



మృతుల కుటుంబాలకు ఉద్యోగాలు

ముద్ర, కోల్‌కతా:
పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చోర్‌బగాన్ సర్బజనీన్ (సర్వజనీన) దుర్గా మండపం వద్ద శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట (Kolkata pandal stampede)లో 19మంది మృతి చెందారు. ఈ



క్రమంలో ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిర్వాహక కమిటీ సభ్యులతో సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నిర్లక్ష్యం వల్ల నిర్వహణ చర్యల్లో లోపాలు చోటు చేసుకొన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గాయపడిన 25మందిని మెరుగైన చికిత్స కోసం కలకత్తా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు (MCH) తరలించారు. ప్రమాదం నేపథ్యంలో చోర్‌బగాన్ సర్బజనీన్ (సర్వజనీన) దుర్గా మండపాన్ని మూసివేసినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల కుటుంబాల్లోని ఒకరికి ఉద్యోగం ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు.

దర్యాప్తునకు సిట్ ఏర్పాటు..
బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి (Suvendu Adhikari) ప్రధాన కార్యదర్శి మనోజ్ అగర్వాల్ కలకత్తా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఘటనపై దర్యాప్తునకు కలకత్తా హైకోర్టుకు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (SIT), ఫ్యాక్ట్-ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సిట్‌లో ఎస్‌టీఎఫ్, సీఐడీ సహా ఇతర దర్యాప్తు సంస్థల అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు రూ.25 లక్షల పరిహారం అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు. గాయపడిన వారికి అయ్యే పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

ముగిసిన ఎన్నికల నామినేషన్లు

ముద్ర, అమరావతి :
ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది.

దర్శిలో వైసీపీకి ఎదురుదెబ్బ
ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.

తదుపరి షెడ్యూల్ ఇదే
నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, రేపు (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

హద్దులు దాటి మాట్లాడాను

ముద్ర, న్యూఢిల్లీ :
కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్‌జెమిని కంపెనీలను పర్మ్ (పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్) నుంచి సస్పెండ్ చేసిన సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై తాజాగా ఓ సమావేశంలో మాట్లాడుతూ..పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. 'భారత్ విషయంలో ఆ రోజు నేను హద్దులు దాటి మాట్లాడాను. 'విదేశీ ఒప్పంద పనివాళ్లు' అని నేను వాడిన పదం సరైనది కాదు. ప్రసంగంలో ఏమైనా లోపాలు ఉంటే.. అది నా తప్పే. హెచ్-1బీ వీసాదారులను లక్ష్యంగా చేసుకోవాలనేది నా ఉద్దేశం కాదు. అమెరికా కంపెనీలు, వీసా వ్యవస్థ గురించి మాట్లాడాలనుకున్నాను. ఉద్యోగులు అమెరికాకు హెచ్-1బీ వీసాపై వస్తారు. వారిని తీసుకున్న కంపెనీలు ఆ పనికి ప్రత్యామ్నాయ అమెరికన్ కార్మికుడు దొరకలేదని పేర్కొంటాయి. దీంతో స్థానికులకు అవకాశాలు దక్కవు. దేశంలో తరచుగా ఇదే జరుగుతోంది. అందుకే ఆ విధంగా మాట్లాడాల్సి వచ్చింది' అని వాన్స్ పేర్కొన్నారు.

నాడు వాన్స్ ఏమన్నారంటే..?
హెచ్-1బీ వీసాలపై నియమించుకునే విదేశీ ఉద్యోగులను 'విదేశీ ఒప్పంద పనివాళ్లు'గా, ఆ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకునే కంపెనీలను 'వీసా మిల్లులు'గా వాన్స్ అభివర్ణించారు. ఆయన వ్యాఖ్యలపై కేంద్ర విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం తెలిపింది. నిపుణుల తరలింపు.. భారతీయులకు అవకాశాలు కల్పించడంతో పాటు అమెరికా కంపెనీల సంపదను కూడా పెంచుతోందని పేర్కొంది. ఆవిష్కరణలు, పరిశోధన, ఉత్పాదకత, పోటీతత్వం, ఉద్యోగకల్పన వంటి విషయాల్లో కంపెనీలకు అత్యాధునిక ప్రతిభ ఎంతో సహాయకారిగా ఉందని వ్యాఖ్యానించింది. ఈ విషయంపై వాన్స్ అనవసరంగా మాట్లాడారని అభిప్రాయపడింది.

ఆహార భద్రతపై FSSAI నిబంధనలు..

ముద్ర, న్యూఢిల్లీ:
దేశంలో ఆహార భద్రత, ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI) ఇవాళ కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. త్వరగా పాడైపోయే ఆహార ఉత్పత్తులైన కోవా, పన్నీర్, మాంసం, చేపల సేకరణ, నిల్వ, రవాణా, విక్రయాల్లో కఠిన ఉష్ణోగ్రత ప్రమాణాలను పాటించాలని ఆహార వ్యాపార నిర్వాహకులకు స్పష్టం చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో త్వరగా పాడయ్యే ఆహార పదార్థాలను తగిన ఉష్ణోగ్రతల్లో రవాణా చేయడం, సరిగ్గా నిల్వ చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. నియంత్రిత ఉష్ణోగ్రతలు పాటించకపోవడం వల్ల వాటిలో బ్యాక్టీరియా, సూక్ష్మజీవులు వేగంగా వృద్ధి చెంది పదార్థాలు కలుషితమవుతాయని, దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

కీలక మార్గదర్శకాలు ఇవే..
ఉష్ణోగ్రతల నిర్వహణ: ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనలు-2011 ప్రకారం ముడి సరుకు సేకరణ నుంచి వినియోగదారునికి అందే వరకు.. చిల్లింగ్, రవాణా, నిల్వ, పంపిణీ దశల్లో క్రమం తప్పకుండా నిర్దేశిత ఉష్ణోగ్రతలను నిర్వహించాలని ఆదేశించింది. రవాణాకు ఉపయోగించే వాహనాలు పూర్తిగా శుభ్రంగా, సురక్షితంగా ఉండాలని సూచించింది. ప్యాకేజింగ్ కోసం కేవలం 'ఫుడ్-గ్రేడ్' మెటీరియల్‌ను మాత్రమే వాడాలని.. గోనె సంచులు, కలుషితమయ్యే నాసిరకం కవర్ల వాడకాన్ని తక్షణమే నిలిపివేయాలని పేర్కొంది.

భౌతిక భద్రత, పక్కా రికార్డుల నిర్వహణ..
రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ సమయాల్లో దుమ్ము, తేమ, క్రిమి కీటకాలు, ఇతర పదార్థాల వల్ల ఆహారం కలుషితం కాకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని FSSAI స్పష్టం చేసింది. సరుకుకు సంబంధించిన ట్రాకింగ్ వివరాలు, ఇన్వాయిస్, సరైన రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని, అధికారులు తనిఖీ చేసినప్పుడు సమర్పించాలని ఆదేశించింది.

సద్దుల సంబురం



(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు బతుకమ్మ వేడుకలతో కళకళలాడాయి. వీధులు, కూడళ్లు, ఆలయ ప్రాంగణాలు, చెరువుల పరిసరాల్లో ఎక్కడ చూసినా పూల పండుగ సందడే కనిపించింది. తీరొక్క పూలతో పేర్చిన పెద్ద బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర పూలతో రంగురంగులుగా అలంకరించిన బతుకమ్మలు ప్రకృతి అందాలకు ప్రతిరూపాలుగా నిలిచాయి. మహిళలు బతుకమ్మల చుట్టూ వలయంగా చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆడిపాడారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెద్ద బతుకమ్మతో ప్రత్యేక సందడి..
బతుకమ్మ పండుగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. 9 రోజుల పాటు సాగిన పూల పండుగకు ముగింపు పలికే ఈ రోజును మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. సాధారణ రోజుల కంటే పెద్దగా, మరింత అందంగా బతుకమ్మలను పేర్చి గౌరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందమైన రంగుల్లో పూలను వరుసలుగా పేర్చి, మధ్యలో పసుపుతో చేసిన గౌరమ్మను ప్రతిష్ఠించి భక్తితో కొలుస్తారు. ఉదయం నుంచే ఇళ్లలో పండుగ సందడి మొదలైంది. పూల సేకరణ, బతుకమ్మల తయారీ, పూజా కార్యక్రమాలు, నైవేద్యాల సిద్ధం వంటి పనులతో మహిళలు బిజీగా గడిపారు. సాయంత్రం వేళ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి బతుకమ్మలను తీసుకొని నిర్దేశిత ప్రదేశాలకు చేరుకున్నారు. అక్కడ సామూహికంగా బతుకమ్మ పాటలు పాడుతూ సంప్రదాయాన్ని కొనసాగించారు. మహిళల రంగురంగుల వస్త్రధారణ, బతుకమ్మల అందాలు, పాటల సందడి పండుగకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి.

5 రకాల సద్దులతో నైవేద్యం..
సద్దుల బతుకమ్మ వేడుకల్లో నైవేద్యాలకు విశేష ప్రాధాన్యం ఉంది. ఐదు రకాల సద్దులను తయారు చేసి గౌరీదేవికి సమర్పించడం ఈ పండుగలోని ముఖ్యమైన సంప్రదాయాల్లో ఒకటి. సద్దులు, పప్పులు, నువ్వులు, పెరుగు తదితర పదార్థాలతో ప్రాంతీయ ఆచారాలకు అనుగుణంగా నైవేద్యాలను సిద్ధం చేస్తారు. కుటుంబ సభ్యులంతా కలిసి ఈ వంటకాలను తయారు చేయడం ద్వారా పండుగలో కుటుంబ అనుబంధాలు బలపడతాయి.
గౌరీదేవికి నైవేద్యాలు సమర్పించిన మహిళలు తమ కుటుంబాలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. పూజల అనంతరం సంప్రదాయం ప్రకారం నైవేద్యాలను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో పంచుకున్నారు. భక్తి, సంప్రదాయం, ఆప్యాయత కలగలిసిన ఈ ఆచారాలు సద్దుల బతుకమ్మకు గుర్తింపును తీసుకొస్తాయి.

ఆటపాటలతో పల్లెలు, పట్టణాలు..
బతుకమ్మ వేడుకల్లో మహిళల ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తరతరాలుగా వస్తున్న జానపద గీతాలను ఆలపిస్తూ మహిళలు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. బతుకమ్మ పాటల్లో ప్రకృతి అందాలు, పల్లె జీవనం, కుటుంబ బంధాలు, మహిళల అనుభవాలు, సామాజిక జీవనానికి సంబంధించిన భావాలు ప్రతిబింబించాయి. తరం నుంచి మరో తరానికి సంస్కృతిని అందించే మాధ్యమంగా ఈ పాటలు నిలిచాయి.
విద్య, ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనులతో బిజీగా ఉండే మహిళలు సైతం బతుకమ్మ పండుగ కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించారు. వివాహితులు తమ పుట్టింటికి చేరుకొని కుటుంబ సభ్యులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. చాలా ప్రాంతాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరి సామూహికంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు బతుకమ్మ సంప్రదాయాలను పరిచయం చేస్తూ, పూల ప్రాధాన్యాన్ని వివరిస్తూ భావితరాలకు అందించే ప్రయత్నం చేశారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం..
పాటలు, పూజలు, నైవేద్యాల అనంతరం బతుకమ్మ నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. మహిళలు తమ బతుకమ్మలను చేతబట్టి ఊరేగింపుగా చెరువులు, కుంటల పద్దకు చేరుకున్నారు. అక్కడ మరోసారి బతుకమ్మ పాటలు పాడుతూ, గౌరీదేవికి మొక్కులు చెల్లించుకుంటూ భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. చెరువుల పరిసరాలు మహిళల సందడి, పూల అందాలు, సంప్రదాయ గీతాలతో పండుగ వాతావరణాన్ని తలపించాయి.
తొమ్మిది రోజుల పాటు పూలతో కొలిచిన బతుకమ్మకు నిమజ్జనం ద్వారా వీడ్కోలు పలికారు. బతుకమ్మను నీటిలో నిమజ్జనం చేయడం పండుగలో కీలక ఘట్టంగా నిలుస్తుంది. ఈ సమయంలో మహిళలు వచ్చే ఏడాది కూడా తమ జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని కోరుకుంటూ గౌరీదేవిని ప్రార్థించారు. పండుగ ముగిసినా, ఆ సంబరాల జ్ఞాపకాలు మాత్రం ప్రతి ఇంట్లోనూ మధురానుభూతులుగా మిగిలాయి.

ప్రకృతిని ఆరాధించే అరుదైన పండుగ..
బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదు.. ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే గొప్ప సాంస్కృతిక వేడుక. వర్షాకాలం ముగింపు దశలో ప్రకృతిలో విరబూసే పూలను సేకరించి వాటిని దేవతా స్వరూపంగా భావించి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. ప్రకృతిని గౌరవించడం, పూల అందాలను ఆస్వాదించడం, సమాజంలోని ప్రజలంతా కలిసి సంబరాలు చేసుకోవడం వంటి విలువలను బతుకమ్మ చాటిచెబుతుంది.
గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుంది. పూలను సేకరించడం నుంచి బతుకమ్మను పేర్చడం, పాటలు పాడడం, సామూహికంగా వేడుకలు నిర్వహించడం వరకు ప్రతి అంశంలోనూ తెలంగాణ పల్లె సంస్కృతి కనిపిస్తుంది. ప్రకృతి ప్రసాదించిన వనరులను గౌరవించాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుంది. పూలను పూజించడం ద్వారా ప్రకృతి పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసే సంప్రదాయం బతుకమ్మను ఇతర పండుగల నుంచి ప్రత్యేకంగా నిలబెడుతుంది.

తెలంగాణ ఆత్మగౌరవానికి చిహ్నం..
బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. కులం, వర్గం, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా మహిళలంతా ఒకచోట చేరి వేడుకల్లో పాల్గొనడం ఈ పండుగ గొప్పతనం. తమ కుటుంబాలకే పరిమితం కాకుండా సమాజంతో కలిసి ఆనందాన్ని పంచుకునే అవకాశం బతుకమ్మ కల్పిస్తుంది. మహిళల సృజనాత్మకత, సంప్రదాయ పరిజ్ఞానం, కళాత్మక నైపుణ్యాలను ఈ వేడుకలు ప్రతిబింబిస్తాయి.
తెలంగాణ రాష్ట్ర సంస్కృతికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన పండుగల్లో బతుకమ్మకు విశిష్ట స్థానం ఉంది. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, పల్లె జీవన విధానం, జానపద కళలకు ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుంది. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో స్థానిక ఆచారాలు, సంప్రదాయాలకు అనుగుణంగా వేడుకలు నిర్వహించినప్పటికీ.. పూలతో గౌరీదేవిని ఆరాధించడం, మహిళలంతా కలిసి పాటలు పాడుతూ సంబరాలు చేసుకోవడం అనే మూలస్ఫూర్తి మాత్రం ఒకటే.
తొమ్మిది రోజుల పాటు తెలంగాణ అంతటా సందడి చేసిన బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మతో ఘనంగా ముగిసింది. పూల పరిమళాలు, జానపద గీతాలు, సంప్రదాయ నైవేద్యాలు, సామూహిక వేడుకలు, చెరువుల్లో నిమజ్జనాలతో తెలంగాణ మరోసారి తన సంస్కృతీ వైభవాన్ని చాటుకుంది. పండుగ ముగిసినా బతుకమ్మ ఇచ్చిన ప్రకృతి ప్రేమ, మహిళల ఐక్యత, కుటుంబ అనుబంధాలు, సంప్రదాయాల పరిరక్షణ అనే సందేశాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయి. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే ఈ అరుదైన వేడుక తెలంగాణ సంస్కృతికి చిరస్థాయిగా నిలిచే మధురమైన పండుగగా మరోసారి తన ప్రత్యేకతను చాటింది.

ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ శోభ

ముద్ర, హైదరాబాద్ :
తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ వేడుకలకు హైదరాబాద్ మహానగరం సిద్ధమైంది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ వేదికగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. మరికొద్దిసేపట్లో ట్యాంక్‌బండ్ అమరవీరుల స్మారకం నుంచి మహా బతుకమ్మల ర్యాలీ అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. ఈ శోభాయాత్రలో సుమారు 700 మంది కళాకారులు తమ జానపద ప్రదర్శనలతో అలరించనుండగా, 600 మందికి పైగా మహిళలు పేర్చిన రంగురంగుల బతుకమ్మలతో పాల్గొననున్నారు.

చీఫ్ గెస్ట్‌లుగా గవర్నర్, మంత్రులు..
వేడుకలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా, పలువురు మంత్రులతో పాటు ప్రముఖ సినీ జోడీ విజయ్ దేవరకొండ-రష్మిక దంపతులు ప్రత్యేక ఆకర్షణగా హాజరుకానున్నారు. సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని ట్యాంక్‌బండ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. హుస్సేన్‌సాగర్ తీరంలో సందర్శకులను, భక్తులను ఆకట్టుకునేలా ప్రత్యేక ఫైర్‌వర్క్స్, కలర్ ఫుల్ లేజర్ షో ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు.



పండుగ సంబురం
లేకుండా చేశారు

ముద్ర, హైదరాబాద్ :
తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ టికెట్ ధరలను పెంచి ప్రజలకు పండుగ సంబురం లేకుండా చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రెగ్యులర్ బస్సులు తగ్గించి, స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టడం దారుణమన్నారు. మేరకు హరీశ్‌రావు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు టికెట్ ధర రూ.230 ఉంటే ఏకంగా రూ.400కు పెంచారన్నారు. మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ.220 ఉంటే.. ఇప్పుడు రూ.290కి పైగా వసూలు చేస్తున్నారన్నారు.
రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రూట్లలో టికెట్ ఛార్జీలు డబుల్ చేసి జేబులు గుల్ల చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకుండా, రెగ్యులర్‌గా నడిచే బస్సులకే పండుగ స్పెషల్ బోర్డులు తగిలించి దోపిడీ చేస్తున్నారన్నారు. ఇప్పటికే మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఆర్టీసీ టికెట్ ఛార్జీలను 5 సార్లు పెంచారని.. ఇప్పుడు పండుగల పేరుతో డబుల్ ఛార్జీలు వసూలు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు.



తగ్గేదే లే!

(మొదటి పేజీ తరువాయి)
బలంగా ఆశిస్తున్నట్లు అభిజీత్ దీప్కే తెలిపారు. వారిద్దరూ విడుదలైన వెంటనే అందరం కలిసి సమావేశమవుతామని చెప్పారు. ఇప్పటి వరకు చోటుచేసుకున్న పరిణామాలను సమగ్రంగా సమీక్షించడంతో పాటు, ఉద్యమం ఎదుర్కొంటున్న పరిస్థితులు, భవిష్యత్తులో అనుసరించాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చిస్తామని వెల్లడించారు. ఉద్యమాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందించి, కీలక నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు.

న్యాయపోరాటానికి సిద్ధం
తాము చేస్తున్న పోరాటం కేవలం ఒక వ్యక్తి లేదా ఒక వర్గానికి సంబంధించిన అంశం కాదని, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు సంబంధించినదని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ఈ పోరాటాన్ని ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు.ప్రస్తుత పరిణామాల్లో చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడంతో పాటు, తదుపరి చర్యలపై స్పష్టమైన న్యాయ వ్యూహాన్ని రూపొందించుకోవడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రముఖ న్యాయవాది వృందా గ్రోవర్‌ను కలిసేందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత కేసులకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, తదుపరి అనుసరించాల్సిన విధానాలపై చర్చించనున్నట్లు వివరించారు. చట్టపరమైన మార్గాల్లోనే తమ హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

బెదిరింపులకు లొంగం..
రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపే వారిని నిర్బంధించడం, అరెస్టుల ద్వారా భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. అధికారుల చర్యలతో తమ సంకల్పాన్ని దెబ్బతీయలేరని అన్నారు. న్యాయస్థానాలపై నమ్మకంతో, ప్రజల అండతో చివరి వరకూ పోరాడుతామని స్పష్టం చేశారు. ఉద్యమ సహచరుల విడుదల అనంతరం నిర్వహించే సమావేశం తమ భవిష్యత్ కార్యాచరణకు కీలకంగా మారనుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటివరకు ఎదురైన పరిణామాలను సమీక్షించి, న్యాయపరమైన పోరాటంతో పాటు ఉద్యమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై నాయకులు చర్చించనున్నారు. మొత్తంగా, అరెస్టులు, నిర్బంధాలకు భయపడకుండా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని అభిజీత్ దీప్కే చేసిన ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

ట్రాయ్ దెబ్బకు దిగొచ్చిన ఎయిర్ టెల్..

ముద్ర, ముంబై :
టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) కొత్త నిబంధనల ప్రకారం భారతీ ఎయిర్‌టెల్ ప్రత్యేకంగా వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల కోసం ప్రత్యేక ప్రీపెయిడ్ ప్లాన్‌లను మార్కెట్లోకి తీసుకువచ్చింది. కేవలం కాల్స్, మెసేజ్‌లు మాత్రమే ఉపయోగించుకునే వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని ప్లాన్‌లను రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. వినియోగదారుల అవసరాలకు తగినట్లుగా ఎయిర్‌టెల్ మూడు భిన్నమైన ప్లాన్‌లను ప్రకటించింది. ఇవి ఎయిర్‌టెల్ అధికారిక వెబ్‌సైట్, యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. రూ. 185, రూ. 203, రూ. 206 ధరలతో లభించే ఈ ప్లాన్ల ద్వారా వినియోగదారులకు అపరిమిత లోకల్, ఎస్‌టీడీ, రోమింగ్ కాల్స్‌తో పాటు ప్రతి ప్లాన్‌లో 300 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా లభించనున్నాయి. ఇవి కాకుండా మూడు ప్లాన్లలోనూ ఉచితంగా హలోట్యూన్స్ (కలర్ ట్యూన్) సౌకర్యం కూడా కల్పించారు. రూ. 185 ప్లాన్ విషయానికి వస్తే ఇది 28 రోజుల వ్యాలిడిటీని కలిగి ఉంది. ప్రతీ రోజూ అపరిమిత కాల్స్, మెసేజ్ లు చేసుకోవచ్చు. అటు రూ. 203 ప్లాన్ ను సరిగ్గా 30 రోజుల వ్యాలిడిటీతో ఎయిర్ టెల్ తీసుకొచ్చింది. మరోవైపు రూ. 206 ప్లాన్ ను సైతం 30 రోజుల వ్యాలిడిటీతో లాంచ్ చేసింది. అయితే దీనికి నిర్దిష్ట రోజుల కాలపరిమితి కాకుండా 'క్యాలెండర్ మంత్' (నెలవారీ) ప్రాతిపదికన వాలిడిటీ వర్తించనుండటం గమనార్హం.
మొబైల్ డేటా అవసరం లేని వినియోగదారులు అనవసరంగా ఇంటర్నెట్ కు కలిపి డబ్బులు చెల్లించాల్సి వస్తోందన్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ట్రాయ్ ఈ కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. గత నెలలో ప్రకటించిన నూతన మార్గదర్శకాల ప్రకారం అక్టోబర్ 21 లోపు టెలికాం ఆపరేటర్లందరూ ఎలాంటి మొబైల్ డేటా లేని ప్రత్యేక వాయిస్, ఎస్ఎంఎస్ ప్లాన్‌లను ప్రవేశపెట్టాలని ఆదేశించింది. అంతేకాకుండా వినియోగదారులకు తక్కువ కాల వ్యవధి ప్లాన్లు, నెలవారీ రెన్యూవల్ ఉన్న ఆప్షన్లను అందుబాటులో ఉంచాలంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 19.10.2026
www.mudranews.in | @mudranews

ఐరన్‌తో రక్తహీనతకు చెక్!

వట్టి తునకల్లో ఉండే ఐరన్ శరీరంలో హిమోగ్లోబిన్ తయారీకి సహాయపడుతుంది. ఐరన్ లోపం వల్ల వచ్చే రక్తహీనత నివారణలో తగిన పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుంది.



జర్మనీ ఉద్యోగాల పేరుతో మోసమా?

టామ్‌కామ్‌పై హరీష్ రావు ఫైర్
జర్మనీ ఉద్యోగాల పేరుతో రూ.4.5 లక్షల వసూలు?
75 మంది నిరుద్యోగులకు రెండేళ్లుగా ఎదురుచూపులు
బాధితులకు పరిహారం చెల్లించాలని హరీష్ రావు డిమాండ్
టామ్‌కామ్‌పై సీఐడీ విచారణకు డిమాండ్

ముద్ర, హైదరాబాద్ : విదేశాల్లో ఉద్యోగాల పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగ యువతను నిలువునా ముంచిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'టామ్‌కామ్' ద్వారా జర్మనీలో కొలువులంటూ ప్రచారం చేసి, అమాయక యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడిందని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. రాష్ట్రంలోని 15 జిల్లాలకు చెందిన 75 మంది నిరుద్యోగుల నుంచి వీసాలు, పరీక్షల పేరిట ఒక్కొక్కరి వద్ద దాదాపు రూ. 4.5 లక్షల వరకు వసూలు చేసి రెండేళ్లుగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ మాటలు నమ్మి తల్లిదండ్రులు, భార్యల మెడలోని పుస్తెలతాడును తాకట్టు పెట్టి డబ్బులు కట్టిన యువకులు.. నేడు ఉద్యోగాలు రాక, మరోవైపు అప్పుల వడ్డీలు కట్టలేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటర్వ్యూలు లేవు.. లక్ష్మో కోర్టుతో బెదిరింపులు

ప్రభుత్వం అధికారికంగా చేపట్టిన ఈ ప్రక్రియలో రెండేళ్లు గడిచినా కనీసం ఒక్క అభ్యర్థికీ జర్మన్ కంపెనీతో ఇంటర్వ్యూ ఇప్పించలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందని హరీష్ రావు ఎద్దేవా చేశారు. బేసిక్ లాంగ్వేజ్ పరీక్ష (B1) పాసైన వారికి మళ్లీ B2 అంటూ కొత్త కొర్రీలు పెడుతున్నారని, తొమ్మిది మంది జర్మనీకి వెళ్తున్నారంటూ ఘనంగా ప్రచారం చేసుకుని తీరా ఒక్కరిని కూడా పంపించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాల్లో ఏదైనా సమస్య వస్తే ఏకంగా 1,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్మో కోర్టుకు వెళ్లాలని అమాయక యువతతో అగ్రిమెంట్లపై బలవంతంగా సంతకాలు పెట్టించుకోవడం దారుణమని దుయ్యబట్టారు. టామ్‌కామ్ ద్వారా ఇప్పటివరకు విదేశాల్లో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారంటూ ఆర్టీఐ (RTI) ద్వారా సమాచారం కోరినా, చట్టబద్ధమైన గడువు దాటినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడం శోచనీయమన్నారు. బాధితులు న్యాయం కోసం కన్నీరు కారుస్తుంటే, కార్మిక శాఖ మంత్రి మాత్రం మొన్న జూన్‌లో మరో కొత్త బ్యాచ్‌ను ప్రారంభిస్తూ మాయమాటలు చెప్పడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు.



వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి.. సీఐడీ విచారణ జరపాలి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, జాబ్ క్యాలెండర్ ఎటుపోయిందని రేవంత్ ప్రభుత్వాన్ని హరీష్ రావు నిలదీశారు. ఈ కుంభకోణానికి సంబంధించి ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టామ్‌కామ్ ద్వారా వసూలు చేసిన ప్రతి పైసాను బాధితులకు వెంటనే వాపస్ ఇవ్వడంతో పాటు, రెండేళ్ల విలువైన కాలం వృథా చేసినందుకు, తెచ్చిన అప్పుల వడ్డీల భారం , మానసిక క్షోభకు గురిచేసినందుకు ఒక్కో అభ్యర్థికి తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. మోసపోయిన బాధితులందరికీ ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని, టామ్‌కామ్ కుంభకోణంపై వెంటనే సీఐడీ లేదా న్యాయ విచారణ జరిపించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎంత ఫీజు వసూలు చేశారు, ఎంతమందికి విదేశీ ఉద్యోగాలు ఇచ్చారనే అంశంపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని స్పష్టం చేశారు. నిరుద్యోగ కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి వెంటే ఉండి పోరాటం సాగిస్తుందని హరీష్ రావు హెచ్చరించారు.

అరుదైన ప్రజానేత ఆర్.దామోదర్‌రెడ్డి

ప్రజాసేవే ధ్యేయంగా పనిచేసిన నాయకుడు



ముద్ర, హైదరాబాద్: ప్రజాసేవనే రాజకీయ ధర్మంగా భావించి, నిజాయితీ, నిబద్ధతలకు ప్రాధాన్యమిచ్చిన అరుదైన నాయకుడు దివంగత ఆర్ . దామో దర్ రెడ్డి అని ఏపీ జెన్ కో జాయింట్ సెక్రటరీ, ఆయన మాజీ అదనపు అంత రంగిక కార్యదర్శి ఎన్.వి.వి. గోపాల్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు శ్రీరాంసాగర్ జలాల సాధనకు ఆయన చిత్తశుద్ధితో కృషి చేశారని గుర్తుచేశారు. 2007లో ఐటీ, క్రీడల శాఖ మంత్రిగా హైదరాబాద్ ఐటీ రంగ అభివృద్ధికి, క్రీడలకు ప్రోత్సాహం అందించారని తెలిపారు. భారత్–పాకిస్తాన్ వాలీబాల్ మ్యాచ్ సందర్భంగా వెంటనే స్పందించి రూ.2 లక్షల నగదు బహు మతిని ప్రకటించడం ఆయన క్రీడాభిమానానికి నిదర్శనమన్నారు. శాఖలపై సమగ్ర అవగాహనతో సమీక్షలు నిర్వహించడం, అధికారుల పనితీరును మెరుగుపరచడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉంటూ పనికే ప్రాధాన్యమిచ్చేవారని, తన సిబ్బంది అవసరాల్లోనూ అండగా నిలిచేవారని చెప్పారు. నేటి రాజకీయాల్లో దామోదర్ రెడ్డి వంటి నిజాయితీగల నాయకులు ఆదర్శమని గోపాల్ రావు అన్నారు. ప్రజల కోసం తన భూములను సైతం అమ్ముకున్న ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన మరణం కాంగ్రెస్ పార్టీతో పాటు తెలంగాణ రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్నారు.

కారు ఢీ కొని అన్నాచెల్లెళ్ల మృతి

ముద్ర, హైదరాబాద్ : స్కూటీపై వెళ్తున్న అన్నాచెల్లెళ్లను కారు ఢీ కొనడంతో వారిద్దరూ మృత్యువాత పడ్డారు. మరో చిన్నారికి గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్ నగర శివారులోని పెద్ద అంబర్‌పేట వద్ద చోటు చేసుకుంది. పెద్ద అంబర్‌పేటకు చెందిన నవీన్.. శంషాబాద్‌లో ఉంటున్న తన చెల్లి రేఖను దసరా పండగ కోసం ఇంటికి తీసుకొస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కోడాడలో విషాదం.. తల్లి దాడిలో చిన్నారి మృతి



ముద్ర, కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో విషాదం చోటు చేసుకుంది. తొమ్మిదేళ్ల బాలిక జాస్మిన్‌పై కన్నతల్లే దాడి చేసి చంపేసింది. శనివారం సాయంత్రం ఆడుకుంటున్న జాస్మిన్‌పై తల్లి సైరాబాను రాయితో దాడి చేసినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. సైరాబాను గత కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే భర్త కూడా దూరంగా ఉంటున్నాడు. చిన్నారితో కలిసి కోదాడలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. చిన్నారి మృతితో పట్టణంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతురాలి మేనమామ ఫిర్యాదు మేరకు కోదాడ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాంసం కోసం కారేసుకుని వచ్చారు..
మేకలన్నీ ఎత్తుకుపోయారు



ముద్ర, హైదరాబాద్ : దసరా పండుగ వేళ మేకలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో దొంగలు వినూత్న రీతిలో చోరీకి పాల్పడ్డారు. పండుగ సందర్భంగా మాంసం విక్రయాల కోసం ఖర్చు లేకుండా లాభపడాలనే దురాశతో దుండగులు ఏకంగా కారులో వచ్చి మేకలను ఎత్తుకెళ్లిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్వెల్లిగూడ ప్రాంతంలో చోటుచేసుకుంది. ముత్వెల్లిగూడ గ్రామానికి చెందిన బుర్ర నర్సింహ, బుర్ర అశోక్ అనే బాధితులు దసరా పండుగ సందర్భంగా తమ మేకలను, మేకపోతులను విక్రయించి మంచి ఆదాయం పొందవచ్చని ఆశించారు. అయితే, అక్టోబర్ 17వ తేదీన అర్ధరాత్రి వేళ మహీంద్రా కారులో వచ్చిన గుర్తుతెలియని ముఠా, కంటి రెప్పపాటులో మేకలను కారులో ఎక్కించుకుని అక్కడి నుంచి పరారయ్యారు. ఉదయాన్నే లేచి చూసేసరికి తమ మేకలు కనిపించకపోవడంతో బాధితులు దిగ్భ్రాంతికి గురై మేడిపల్లి పోలీసులను ఆశ్రయించారు.పండుగ వేళ కష్టపడి పెంచుకున్న జీవాలు దొంగతనానికి గురికావడంతో బాధితులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొని కన్నీరుమున్నీరవుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరా ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దొంగలు ఉపయోగించిన మహీంద్రా కారు నంబర్ , ప్రయాణించిన మార్గాన్ని ఆధారంగా చేసుకుని నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు. పండుగ రోజుల్లో పెరిగిన మాంసం డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాల పట్ల జీవాల పెంపకందారులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో అగ్ని ప్రమాదం

ముద్ర, హైదరాబాద్: మాదాపూర్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానిక యూనిస్టింగ్ టెక్ సొల్యూషన్‌లో మంటలు చెలరేగాయి. యాంటీ డ్రోన్ సిస్టమ్స్ తయారీకి సంబంధించిన గోదాములో మంటలు చెలరేగడంతో భయాందోళనకు గురైన కంపెనీ ఉద్యోగులు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

ఎంవీఎస్ఆర్ కాలేజీలో ఘోర ప్రమాదం..
లైటింగ్ స్టాండ్ కూలి విద్యార్థిని మృతి

ముద్ర, హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ పరిధిలోని నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ (MVSR) ఇంజనీరింగ్ కళాశాలలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. లైటింగ్ సిస్టమ్ ఒక్కసారిగా కూలిపోయి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ప్రథమ సంవత్సరం బీటెక్ విద్యార్థిని నారాయణదాసు సోనా (18) మృతి చెందగా.. పలువురు విద్యార్థులు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శనివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన 10 మంది ప్రస్తుతం మలక్‌పేట యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో స్పందన (18) డిశ్చార్జ్ అయినట్లు వైద్యులు తెలిపారు. ఇక, 17 ఏళ్ల అక్షరారెడ్డి.. విద్యార్థిని ఐసీయూలో చికిత్స పొందుతోంది. మరో ఎనిమిది మందికి సంబంధించిన వివరాలను యాజమాన్యం పంచుకుంది. ఇందులో శ్రేయ (18), మంచిర్యాల, విష్ణు (21), మహబూబ్‌నగర్, సానియా (18), నల్గొండ, సుష్మ (19), దేవరకొండ, దీక్షిత (21), గద్వాల, మీనా (17), వనపర్తి, అనుజ్ఞ (18), మహబూబ్‌నగర్, షహీరా షేక్ (18), రక్షాపురం ఉన్నారు. ఇక మృతి చెందిన స్టూడెంట్ సోనీ కుటుంబ సభ్యులు మాట్లాడారు. "నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ నిర్లక్ష్యం వల్లే సోనీని కోల్పోయాం. సోనీ నారాయణదాసు పెద్ద పాప. తలపై లైట్ స్టాండ్‌లు పడి స్పాట్లోనే మృతి చెందింది. చిన్న పాప పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తుంది. కాలేజీలో దాండియా ప్రోగ్రాం జరుగుతుంది. కాలేజ్ మేనేజ్మెంట్ నిర్లక్ష్యం కారణంగానే సోనీ నారాయణదాసు చనిపోయింది. కాలేజ్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. మాది వనపర్తి జిల్లా. మాది పేద కుటుంబం. మోనా నారాయణదాసు కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. కాలేజ్ మేనేజ్మెంట్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి." అని వివరించారు.



'ఓటు చోరీ'కి వాళ్లు మూల్యం చెల్లించుకుంటారు!



- రాహుల్ గాంధీ

ముద్ర, న్యూఢిల్లీ : సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సీఈసీ ఓటు చోరీకి పాల్పడ్డారనే విషయం యావత్ ప్రపంచానికి తెలుసునని, ఆయనకు అమిత్ షా, ప్రధాని మోదీ మద్దతుగా నిలి చారని ఆరోపించారు. ఇందుకు వాళ్లు తగిన మూల్యం చెల్లించు కుంటారని అన్నారు. గోవాలో రాష్ట్ర కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న రాహుల్.. నేతలు, కార్యకర్తలతో కలిసి రెండు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో మనకు ప్రపంచస్థాయి విద్యా వ్యవస్థ ఉండేదని, కానీ.. ఇప్పుడు మాత్రం నిరసనలు చేస్తున్న విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగిస్తున్నారని విమర్శించారు.

ఇది విద్యా వ్యవస్థ కాదు

దేశంలో విద్యా వ్యవస్థ దారుణంగా తయారయ్యిందని కాంగ్రెస్ నేత విమర్శించారు. డబ్బు, అధికారం లేకుంటే.. లేదా.. ఇంగ్లిష్ రాకపోతే ఈ వ్యవస్థ ఏ మాత్రం ఆలోచించకుండా మిమ్మల్ని బయటకు నెట్టేస్తుందన్నారు. దీన్ని విద్యా వ్యవస్థగా పిలవలేమన్నారు. లక్షలాది మంది దేశ యువతను వ్యవస్థకు దూరంగా ఉంచేందుకు రూపొందించిన 'బహిష్కరణ వ్యవస్థ' అని విమర్శించారు. కొంత మంది విద్యార్థులతో జరిపిన సంభాషణ వీడియోను ఇన్‌స్టాలో షేర్ చేసిన రాహుల్ ఈ విధంగా స్పందించారు.

నిమిషాంబ ఆలయంలో నిత్య అన్నప్రసాద మహాసేవకు శ్రీకారం

- దుర్గాష్టమి వేళ దుర్గాదేవి అలంకరణలో శ్రీ మాతా నిమిషాంబిక





ముద్ర, బోడుప్పల్: శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని బోడుప్పల్‌లోని శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి, ఆదిపరాశక్తి స్వరూపిణి అయిన శ్రీ మాతా నిమిషాంబికా దేవి దుర్గాదేవిగా విశేష అలంకరణలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ పవిత్ర పర్వదినాన అమ్మవారి కృపాకటాక్షాలతో, భక్తులు, దాతలు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో శ్రీ మాతా నిమిషాంబ దేవి నిత్య అన్నప్రసాద వితరణ మహాసేవను ఘనంగా ప్రారంభించారు. శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానం, హంపీ పీఠం సంచాలిత శ్రీ మాతా నిమిషాంబ దేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ మహాసేవ ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్, బోడుప్పల్ మాజీ అధ్యక్షుడు పోగుల నర్సింహ రెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అన్నప్రసాద తయారీకి అవసరమైన స్టీమ్ వంట ప్లాంట్‌ను అందజేసిన దాత సుబ్రమణ్యంను ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో చీరాల నరసింహ, దానగల్ల యాదగిరి, మాజీ కార్పొరేటర్లు, బీ బ్లాక్ అధ్యక్షుడు కొత్త కిషోర్ గౌడ్, పోగుల దిలీప్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కళ్యాణ్, బోడుప్పల్ సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు సామల పవన్ రెడ్డి, బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, తలారి రవి తదితర అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల ప్రముఖులు ఈ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

అన్నదానమే మహాదానం అనే స్ఫూర్తితో ప్రారంభించిన నిత్య అన్నప్రసాద వితరణ మహాసేవ ద్వారా అమ్మవారి సన్నిధికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించాలన్నది ట్రస్ట్ సంకల్పం. భక్తుల సహకారం, దాతల ఔదార్యంతో ఈ మహాసేవకు శ్రీకారం చుట్టడం పట్ల ఆలయ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్. రమేష్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

అలాగే ట్రస్ట్ ధర్మకర్తలు బి. హిమచందర్, రామగిరి శ్రీకాంత్, వై. చంద్రశేఖర్, ఎస్. గౌరీశంకర్, డి. నర్సింగ్ రావు, ఎం. శ్రీనివాస్ రావు, ఎం. సాయిబాబా (శ్యామ్), డి. సతీష్, ఎన్. శ్రీకాంత్, ఎన్. రామకృష్ణ, ఎన్. మోహన్, డి. రామకృష్ణ, ఎన్. శ్రీధర్, వెంకట్ రాజారావు, కె. ప్రవీణ్ కుమార్, డి. నరేష్, వై. సత్యనారాయణతో పాటు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ చంద్రశేఖర్ శర్మ, అర్చకులు ఉమాకాంత్ శర్మ, భక్తులు, దాతలు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే.. అమ్మ కటాక్షం ఉంటే విజయమే మన వెంటే అనే భక్తిభావంతో నిర్వహించిన ఈ మహోత్సవం, నిత్య అన్నప్రసాద మహాసేవ ప్రారంభం బోడుప్పల్‌లో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
సోమవారం, 19 అక్టోబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..



వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

పురుషుల జీవితం
చాలా కఠినం
ఆశ్చర్యపరుస్తున్న నగ్నసత్యం!



భారతీయ పురుషుడి జీవితం అంటే కేవలం ఒక ప్రయాణం కాదు, అదొక అలుపెరుగని పోరాటం. పుట్టిన దగ్గరి నుండి చివరి శ్వాస వరకు బాధ్యతల మోత మోయడమే తన విధిగా మారిపోయింది. తన ఇష్టాలను చంపుకుని, తన కలలను త్యాగం చేస్తూ కుటుంబం కోసం అహర్నిశలు శ్రమించే ఒక సగటు భారతీయుడి జీవిత చక్రం ఎలా ఉంటుందో, వయసుతో పాటు అతను ఎదుర్కొనే సవాళ్లు ఏంటో లోతుగా చూద్దాం.

బాల్యం నుంచే మొదలయ్యే పరుగు పందెం

ఇక మన భారతదేశం లో ఒక మగపిల్లాడు ఇంట్లో పుట్టిన ఐదేళ్ల నుంచే అతనిపై అంచనాల భారం మొదలవుతుంది. కొందరు మరీ మూడు ఏళ్ల నుండే స్కూల్ కు పంపుతున్నారు ఇక ఆడుకోవాల్సిన వయసులో పుస్తకాల సంచి భుజాన పడుతుంది. ఇక్కడ హాబీలకు, ఆటపాటలకు సమయం ఉండదు, కేవలం ర్యాంకులు, మార్కుల వేటలోనే బాల్యం కరిగిపోతుంది. 15 నుండి 22 ఏళ్ల వయసు వచ్చేసరికి లక్షలాది మందితో పోటీ పడుతూ కాలేజీ సీటు కోసం, ఆపై ఒక మంచి ఉద్యోగం కోసం రాత్రింబవళ్లు కష్టపడాలి. సమాజం, టీచర్లు చూపించే కఠిన వైఖరి,నెంబర్ వన్ కావాలి అంటూ అతన్ని ఒక యంత్రంలా మారుస్తుంది. తనకంటూ ఒక కల ఉన్నా, అది రేపటి కెరీర్‌కు పనికిరాదని తెలిస్తే అక్కడే ఆ కలని పాతిపెట్టేసి మంచి భవిష్యత్ కోసం భరోసా ఇచ్చే దారిలో నడవాల్సి వస్తుంది.

పెళ్లి.. పిల్లలు.. బాధ్యతల చక్రబంధం

ఇక 25 ఏళ్లు దాటాక ఉద్యోగం సంపాదించడమే ఆలస్యం, వెంటనే పెళ్లి, సంసారం అనే మరో పెద్ద బాధ్యత ఎదురవుతుంది. ఇక అప్పటి నుంచి అతని జీవితం తనది కాదు. 30 నుండి 50 ఏళ్ల మధ్య కాలంలో భార్య అవసరాలు, పిల్లల చదువులు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల ఆరోగ్యం.. ఇలా అన్నింటినీ తన భుజాలపైనే మోయాలి. సొంతానికి ఒక చొక్కా కొనుక్కోవాలన్నా పది సార్లు ఆలోచించే సగటు తండ్రి, పిల్లల ఫీజుల కోసం మాత్రం అప్పులు చేయడానికైనా వెనకాడడు. ఈ క్రమంలో తన పాత హాబీలు, పర్యటనలు, చిన్ననాటి సరదాలన్నీ మరుగున పడిపోతాయి. కుటుంబం చిరునవ్వులో తన ఆనందాన్ని వెతుక్కునే త్యాగశీలిగా అతను మారిపోతాడు.

అలుపెరుగని శ్రమ.. నిశ్శబ్ద మరణం

60 ఏళ్లు దగ్గరపడుతున్నా విశ్రాంతి అన్న మాట అతని డిక్షనరీలో ఉండదు. రిటైర్మెంట్ తర్వాత కూడా పిల్లల సెటిల్మెంట్, మనవళ్ల భవిష్యత్తు అంటూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటాడు. ఇక జీవితాంతం ఎండనక, వాననక కష్టపడి సంపాదించినదంతా ఇతరుల కోసమే ఖర్చు చేస్తాడు. అనారోగ్యం వచ్చినా, ఒళ్లు సహకరించకపోయినా "నాకేం కాలేదులే" అని అబద్ధం చెబుతూ బాధ్యతల నుంచి తప్పుకోడు. చివరికి తనకంటూ ఏమీ మిగుల్చుకోకుండా, తన త్యాగాలను ఎవరికీ చెప్పుకోకుండా నిశ్శబ్దంగా ఈ లోకాన్ని విడిచి వెళ్తాడు. భారతీయ పురుషుడి జీవితం అంటే ఒక నగ్న సత్యం.. అది అంతులేని బాధ్యతల నిరంతర ప్రవాహం అన్నది నిజం.

ప్రతి మహిళా తెలుసుకోవాల్సిన
9 ఆరోగ్య విషయాలు



పురుషులు మరియు స్త్రీల ఆరోగ్య అవసరాల మధ్య ఉన్న వ్యత్యాసంపై శాస్త్రవేత్తలు తమ అవగాహనను పెంచుకుంటున్నారు. వాస్తవం ఏమిటంటే, పుట్టినప్పుడు మీకు కేటాయించబడిన లింగం, కొన్ని ఆరోగ్య సమస్యలు మిమ్మల్ని ప్రభావితం చేసే అవకాశాన్ని ప్రభావితం చేస్తుంది. పుట్టినప్పుడు కేటాయించబడిన లింగం అనేది ఒక వ్యక్తి పుట్టినప్పుడు వారికి కేటాయించబడిన జీవసంబంధమైన మరియు శరీర నిర్మాణ స్థితి. ఇది వారి శరీర నిర్మాణం మరియు ఇతర లక్షణాలపై ఆధారపడి ఉంటుంది.

గుండె జబ్బు..

మహిళల మరణానికి గుండె జబ్బులు మొదటి కారణం.

గుండెపోటు లక్షణాలు

ఛాతీ నొప్పి

శ్వాస ఆడకపోవడం

చేతులలో బలహీనత

గుండెపోటు లక్షణంగా వారికి వికారం లేదా వాంతులు కూడా అయ్యే అవకాశం ఉంది.

మెనోపాజ్ వల్ల గుండె జబ్బులు రానప్పటికీ, మెనోపాజ్ తర్వాత అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, ఈస్ట్రోజెన్ తగ్గడం వంటి కొన్ని ప్రమాద కారకాలు ఎక్కువగా కనిపిస్తాయి.

పక్షవాతం..

పురుషుల కంటే మహిళలే పక్షవాతంతో ఎక్కువగా మరణిస్తున్నారు. పక్షవాతంలో 2 రకాలు ఉన్నాయి: హెమరేజిక్ (మెదడులో రక్తస్రావం) మరియు ఇస్కీమిక్ (రక్తనాళం మూసుకుపోయి రక్త ప్రసరణకు ఆటంకం కలగడం). అంతర్లీన కారణాన్ని బట్టి లక్షణాలు మారవచ్చు, అయినప్పటికీ, మాట్లాడటంలో ఇబ్బంది మరియు చేతులు, కాళ్ళు మొద్దుబారడం వంటివి పక్షవాతం యొక్క ప్రధాన లక్షణాలు .

గర్భధారణకు, పక్షవాతానికి మధ్య కూడా ఒక సంబంధం ఉంది. గర్భధారణ సమయంలో అధిక రక్తపోటుతో కూడిన పరిస్థితి అయిన ప్రీఎక్లాంప్సియా, మీకు పక్షవాతం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. గర్భధారణ సమయంలో హైపర్‌కోయాగ్యులేషన్ లేదా అధిక రక్త గడ్డకట్టడం వలన రక్త గడ్డల రుగ్మతలు ఎక్కువగా సంభవించే నాడీ సంబంధిత సంఘటనలు కూడా సంభవించవచ్చు. ఈ రక్తపు గడ్డలు మీ మెదడుకు రక్త ప్రసరణను పరిమితం చేయగలవు.

మధుమేహం..

మధుమేహం ఖచ్చితంగా మహిళలకే ప్రత్యేకమైనది కానప్పటికీ, ఇది మహిళల్లో గుండె జబ్బుల ప్రమాదాన్ని నాలుగు రెట్లు పెంచుతుంది. మహిళలు అంధత్వం, మూత్రపిండాల వ్యాధి మరియు డిప్రెషన్ వంటి మధుమేహ సంబంధిత సమస్యలకు కూడా ఎక్కువగా గురవుతారు. గర్భధారణ మధుమేహం అనేది గర్భధారణ సమయంలో సంభవించే ఒక పరిస్థితి, దీనిలో మీ గ్లూకోజ్ స్థాయి పెరిగి ఇతర సమస్యలు తలెత్తుతాయి. ఇది ప్రతి 100 మంది మహిళల్లో కనీసం 3 మందికి సంభవిస్తుంది, దీని చికిత్సలో ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, రక్తంలో గ్లూకోజ్ పర్యవేక్షణ, ఇన్సులిన్ ఇంజెక్షన్లు, నోటి ద్వారా తీసుకునే మందులు ఉండవచ్చు.

మధుమేహం గర్భధారణ సమయంలో గర్భస్రావం మరియు పుట్టుకతో వచ్చే లోపాలతో సహా ఇబ్బందులను కూడా కలిగిస్తుంది. మధుమేహం ఉన్న గర్భిణీ స్త్రీలకు, ముఖ్యంగా ఇన్సులిన్‌పై ఆధారపడిన వారికి ప్రత్యేక పరీక్షలు మరియు పర్యవేక్షణ అవసరం కావచ్చు. టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవడానికి, ఆరోగ్యకరమైన బరువును పాటించడానికి, వ్యాయామం చేయడానికి మరియు ధూమపానం మానేయడానికి ప్రయత్నించండి .

ప్రసూతి ఆరోగ్య సమస్యలు..

ఐరన్ లోపం వల్ల వచ్చే రక్తహీనత నుండి అధిక రక్తపోటు వరకు, గర్భధారణ సమయంలో ఒక వ్యక్తి ఎదుర్కొనే మార్పులు వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి.

"మీకు ఆరోగ్య సమస్యలు ఉన్నా లేకపోయినా, గర్భధారణకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముఖ్యం," అని నార్త్‌వెస్టర్న్ మెమోరియల్ హాస్పిటల్‌లో ప్రసూతి మరియు గైనకాలజిస్ట్ అయిన డాక్టర్ జెస్సికా డబ్ల్యూ. కైలీ అంటున్నారు. "ఉదాహరణకు, మధుమేహం లేదా అధిక రక్తపోటు ఉన్నవారు గర్భం ధరించాలని ప్లాన్ చేసుకునేటప్పుడు, ఈ సమస్యలను సాధ్యమైనంత ఉత్తమ నియంత్రణలో ఉంచుకోవాలి." తీవ్రమైన గుండె జబ్బులు మరియు నాడీ సంబంధిత సమస్యల వంటి అధిక ప్రమాదం ఉన్న పరిస్థితులు ఉన్నవారు, తమ సంరక్షణ ప్రణాళిక గురించి తమ వైద్యుడితో చర్చించాలి. అంతేకాకుండా, బరువు తగ్గించే శస్త్రచికిత్స చేయించుకున్న వెంటనే మీరు గర్భం ధరించకూడదు.

గర్భధారణ సమయంలో, మీరు తగినంత పోషకాహారం తీసుకుంటున్నారని నిర్ధారించుకోవాలని, అలాగే సరైన టీకాలు వేయించుకోవడం ద్వారా నివారణ చర్యలు తీసుకోవాలని డాక్టర్ కైలీ సూచిస్తున్నారు. మీరు యధావిధిగా వ్యాయామం కొనసాగించవచ్చు, కానీ మీకు ఏవైనా సందేహాలుంటే మీ వైద్యుడిని సంప్రదించండి. "గర్భధారణ సమయంలో మందులు తీసుకోవడానికి కొంతమంది సంకోచిస్తారు," అని డాక్టర్ కైలీ అంటున్నారు. "చాలా అనారోగ్య సమస్యలకు మందులతో చికిత్స అవసరం, వాటికి చికిత్స చేయకపోతే మీకు హాని కలగవచ్చు. ఇది మీరు మీ వైద్యుడితో తప్పక చర్చించాల్సిన ముఖ్యమైన విషయం."

మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు..

సూక్ష్మజీవులు మూత్రనాళంలోకి ప్రవేశించి, వృద్ధి చెందడం ప్రారంభించినప్పుడు మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు (UTIలు) సంభవిస్తాయి. పుట్టుకతో ఆడవారిగా జన్మించిన వారిలో UTIలు ముఖ్యంగా సాధారణంగా ఉంటాయి, ఎందుకంటే మగవారితో పోలిస్తే వారి మూత్రనాళం పొట్టిగా ఉంటుంది. దీనివల్ల బ్యాక్టీరియా మూత్రాశయానికి చేరడానికి ప్రయాణించాల్సిన దూరం తగ్గుతుంది. తరచుగా మూత్రవిసర్జన, మూత్రవిసర్జన సమయంలో నొప్పి లేదా మంట, మబ్బుగా ఉండే మూత్రం వంటివి UTI లక్షణాలు . UTI దానంతట అదే తగ్గిపోగలిగినప్పటికీ, అవసరమైతే వైద్యుడు యాంటీబయాటిక్స్ సూచించవచ్చు. ఒకవేళ UTIలు పదేపదే వచ్చే సమస్యగా మారితే, ఇతర పరీక్షల ద్వారా మూత్ర నాళం సాధారణంగా ఉందో లేదో తెలుసుకోవచ్చు.

హెచ్‌పీవీ..

30 కంటే ఎక్కువ రకాల లైంగికంగా సంక్రమించే ఇన్ఫెక్షన్లు (STIs) ఉన్నాయి. వాటిలో అత్యంత సాధారణమైన హ్యూమన్ పాపిల్లోమావైరస్ (HPV)ను HPV వ్యాక్సిన్ తో నివారించవచ్చు.

లైంగికంగా చురుకుగా ఉండే పురుషులు, మహిళలలో దాదాపు 80% మంది తమ జీవితంలో ఏదో ఒక సమయంలో HPV బారిన పడతారు. "HPV చాలా సాధారణమైనది. ఇందులో 100 కంటే ఎక్కువ రకాలు ఉన్నాయి, వాటిలో కనీసం 14 క్యాన్సర్‌తో సంబంధం కలిగి ఉన్నాయి," అని డాక్టర్ కైలీ చెప్పారు. యునైటెడ్ స్టేట్స్‌లో ప్రధానంగా అధిక ప్రమాదం ఉన్న రకాలు 16 మరియు 18, ఈ రెండూ గర్భాశయ ముఖద్వారం యొక్క క్యాన్సర్ పూర్వ దశతో సంబంధం కలిగి ఉంటాయి.

ఒకప్పుడు మహిళల మరణానికి అత్యంత సాధారణ కారణాలలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఒకటిగా ఉండేది. పాప్ టెస్ట్ లేదా HPV స్క్రీనింగ్ ఉపయోగించడం ద్వారా, వైద్యులు క్యాన్సర్‌కు ముందు దశలో ఉన్న కణాలను గుర్తించి, వాటిని తొలగించడానికి చికిత్స అందించగలరు, తద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రేటును గణనీయంగా తగ్గించవచ్చు. డాక్టర్ కైలీ ఇంకా ఇలా అన్నారు, "ఒక అధిక-ప్రమాదకరమైన అసాధారణత క్యాన్సర్‌గా మారకముందే దానిని గుర్తించడమే దీని ఉద్దేశ్యం." గణనీయమైన క్యాన్సర్‌కు ముందు దశ కణాలు కనుగొనబడితే, లూప్ ఎలక్ట్రోసర్జికల్ ఎక్సిషన్ ప్రొసీజర్ (LEEP) ద్వారా గర్భాశయ ముఖద్వారం నుండి క్యాన్సర్‌కు ముందు దశలో ఉన్న కణాలను తొలగించవచ్చు .

రొమ్ము క్యాన్సర్.

చర్మ క్యాన్సర్ తర్వాత, అమెరికాలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అత్యంత సాధారణమైన క్యాన్సర్. వాస్తవానికి, అమెరికాలోని మహిళలకు వారి జీవితకాలంలో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం 13% ఉంది.

మీ ప్రాథమిక వైద్యునితో పంచుకోవడానికి, మీ రొమ్ములలో ఏవైనా మార్పులను గుర్తించడంలో రొమ్ముల పట్ల అవగాహన మీకు సహాయపడుతుంది. ఇది, 40 ఏళ్ల వయస్సులో ప్రారంభం కావాల్సిన మీ వార్షిక మామోగ్రామ్‌కు అదనంగా ఉంటుంది. రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే BRCA1 మరియు BRCA2 జన్యువులను కలిగి ఉన్నవారికి, మీ వైద్యుడు ముందుగానే స్క్రీనింగ్ చేయించుకోమని సిఫార్సు చేయవచ్చు. వ్యాయామం చేయడం మరియు ధూమపానం మానేయడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లను పాటించడం ద్వారా మీరు ప్రమాదాలను నియంత్రించుకోవచ్చు.

ఆస్టియోపొరోసిస్..

ఆస్టియోపొరోసిస్ అనేది మీ ఎముకలను బలహీనపరిచి, అవి విరిగే ప్రమాదానికి గురయ్యేలా చేసే ఒక వ్యాధి. రుతువిరతి తర్వాత ఉన్నవారికి ఆస్టియోపొరోసిస్ సంబంధిత ఎముక విరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇతర ప్రమాద కారకాలలో కొన్ని మందులు, ముందుగానే రుతువిరతి రావడం, తక్కువ బాడీ మాస్ ఇండెక్స్ (BMI), క్యాన్సర్ చికిత్స మరియు జన్యుపరమైన కారణాలు కూడా ఉండవచ్చు. మీరు కాల్షియం ఎక్కువగా తీసుకోవడం, సరైన బరువు మోసే వ్యాయామాలతో చురుకుగా ఉండటం, ధూమపానం, అధిక మద్యపానానికి దూరంగా ఉండటం ద్వారా ఈ ప్రమాదాలను తగ్గించుకోవచ్చు.

అల్జీమర్స్ వ్యాధి..

అల్జీమర్స్ వ్యాధి అనేది ఒక రకమైన మెదడు క్షీణత. దీనిలో న్యూరోఫైబ్రిల్లరీ టాంగిల్స్ మరియు ప్లాక్స్ అని పిలువబడే అసాధారణ కణాలు మెదడులో ఏర్పడి, ఆరోగ్యకరమైన మెదడు కణాలను నాశనం చేస్తాయి. అల్జీమర్స్ వ్యాధితో జీవిస్తున్న 60 లక్షల మంది అమెరికన్లలో, మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. చారిత్రాత్మకంగా దీనికి కారణం మహిళలు ఎక్కువ కాలం జీవించడమే అని భావించినప్పటికీ, ఇది జన్యుపరమైన వైవిధ్యాలకు కూడా సంబంధం కలిగి ఉండవచ్చా అని శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు. చురుకుగా ఉండటం మరియు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంపికలు , మెదడు యొక్క ఉత్తమ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో సహాయపడతాయి.

స్వీట్ డేటింగ్ ట్రెండ్..
ప్రేమకు చెమట పరీక్ష!


ఒకప్పుడు ప్రేమంటే గులాబీ పువ్వులు.. గిటార్ వాయిద్యాలు, సినిమా థియేటర్‌లో పాప్‌కార్న్ షేరింగ్‌లు ఉండేవి. ఆ తర్వాత కాలంలో "రెస్టారెంట్‌లో బిల్లు ఎవరు కడతారు?" అనే చిన్నపాటి ఐక్యూ టెస్టులు నడిచాయి. కానీ ఇవన్నీ ఇప్పుడు ఔట్‌డేటెడ్ బోరింగ్ ముచ్చట్లు! కొత్త తరం జెన్ జెడ్ డేటింగ్ ప్రపంచంలోకి ఒక సరికొత్త వైరస్... సారీ, వైరల్ ట్రెండ్ వచ్చింది. దాని పేరే "స్వెట్ డేటింగ్". అంటే ప్రేమకు ఇప్పుడు చెమట పరీక్ష అన్నమాట.. "నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా లేదా అనేది పక్కన పెట్టు.. ముందు ఆ ట్రెడ్‌మిల్‌పై 20 నిమిషాలు పరిగెత్తి నీ దమ్ము నిరూపించుకో " ఇదీ ఇప్పటి సరికొత్త లవ్ ఫార్ములా.

కాఫీ షాపులు బంద్.. జిమ్‌లే లవ్ స్పాట్లు!

ఈ ట్రెండ్ పుణ్యమా అని ప్రేమికులు ఇప్పుడు కాఫీ షాపులకు వెళ్లడం మానేశారు. నేరుగా జిమ్‌లోనే వాలిపోతున్నారు. డంబెల్స్, బర్పీలు, స్క్వాట్స్ మధ్యే మనసులు కలసిపోతున్నాయి. మేకప్ లేకుండా, చెమటలు కక్కుతూ, ఊపిరి అందక నాలిక బయటపడేసిన స్థితిలో కూడా.. ఎదుటి వ్యక్తిని చూసి మీరు ప్రేమగా నవ్వగలిగితే ఇక మీ ఇద్దరి మధ్య బలమైన కెమిస్ట్రీ ప్రపంచంలోనే లేనట్టే!

సైకాలజిస్టుల వింత లాజిక్కులు!

దీనిపై మానసిక నిపుణులు కూడా తమదైన శైలిలో సీరియస్ రీసెర్చ్‌లు మొదలుపెట్టారు. కలిసి వర్కౌట్ చేస్తే ఒత్తిడి తగ్గుతుందట. కొత్త వ్యక్తిని కలిసినప్పుడు ఉండే టెన్షన్ కరిగిపోతుందట. అన్నిటికంటే ముఖ్యమైన పాయింట్ ఏంటంటే.. బాగా అలసిపోయినప్పుడు మనుషులు అస్సలు నటించలేరు. ఇన్‌స్టాగ్రామ్ ఫిల్టర్లు, ఫేక్ స్మైల్స్, "నేను చాలా క్లాస్ అండ్ కూల్" అనే ఓవర్ యాక్టింగులు అన్నీ ఆ చెమటతో పాటే కారిపోతాయి. ఒరిజినల్ క్యారెక్టర్ బయటపడిపోతుంది. ఈ స్వెట్ డేటింగ్‌పై నెటిజన్లు ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వేదికగా వదులుతున్న మీమ్స్ మామూలుగా లేవు. "మూడు డిన్నర్ డేట్లలో కూడా తెలియని పార్టనర్ గుణం.. ఒక్క లెగ్ డే వర్కౌట్‌లో తెలిసిపోతుంది!" అని ఒకరు.. "స్క్వాట్స్ చేయలేక మధ్యలోనే జిమ్ నుండి పారిపోతే... రిలేషన్ షిప్ భవిష్యత్తు కూడా అదే స్పీడ్‌లో పారిపోతుంది" అని మరొకరు కామెంట్లు పెడుతున్నారు.



జిమ్ ఓనర్లకు పండగ... ట్రైనర్లకు తిప్పలు!

లవర్స్ జిమ్ బాట పట్టడంతో జిమ్ ఓనర్ల పంట పండింది. మార్కెట్లోకి అప్పుడే కొత్త బిజినెస్ ప్యాకేజీలు వచ్చేసాయి. "కపుల్స్ కార్డియో ప్యాకేజ్", "రోమాంటిక్ యోగా", "లవ్ లంజెస్", "హార్ట్‌బీట్ హిట్" అంటూ కొత్త ఆఫర్లు కూడా రెడీ అవుతున్నాయట. ఇక ట్రైనర్లు కూడా ఫిట్‌నెస్ కోచ్‌లా... రిలేషన్‌షిప్ కౌన్సిలర్లా అనే సందేహం వస్తోంది. డేట్‌కి వెళ్లి భారీ వెయిట్లు ఎత్తే ముందు... ఆ రిలేషన్‌షిప్ బరువును మీరు భవిష్యత్తులో మోయగలరో లేదో ఒకసారి ఆలోచించుకోండి. లేదంటే గుండెల్లో ప్రేమ మొదలవ్వడం పక్కన పెడితే.. ఒళ్లంతా కండరాల నొప్పులు మొదలవ్వడం మాత్రం ఖాయం! ఏదేమైనా... కలిసి చెమటోడ్చిన జంటే.. జీవితాన్ని కూడా కలిసి నడిపించగలదు అనే కొత్త సామెత పుట్టుకొచ్చింది. రేపు పొద్దున "సైలెంట్ డేటింగ్", "స్లీప్ డేటింగ్" లాంటి ట్రెండ్లు వచ్చినా ఆశ్చర్యపోకండి. కాలం మారుతోంది, ట్రెండ్లు మారుతున్నాయి.. కానీ ప్రేమ మాత్రం ప్రతి తరాన్ని తనదైన స్టైల్‌లో చెమటలు పట్టిస్తూనే ఉంది.

న్యూక్లియర్ ఫ్యామిలీస్ రైజ్
సంప్రదాయాలకు సవాళ్లు ఏంటి?



నేటి మోడరన్ లైఫ్‌స్టైల్‌లో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై చిన్న కుటుంబాల ట్రెండ్ పెరిగింది. విద్యావంతులు, ఉద్యోగస్తులు కేవలం ఒకరిద్దరు పిల్లలతోనే సరిపెట్టుకుంటున్న ఈ రోజుల్లో.. జనాభా పూర్తిగా తగ్గిపోతున్న కొన్ని ప్రత్యేక కమ్యూనిటీలు ఆందోళన చెందుతున్నాయి. గుజరాత్‌లోని కచ్ కడ్వా పాటిదార్ సమాజ్ మూడో బిడ్డను కనేవారికి రూ. 50 వేలు ఇస్తామని ప్రకటించడం, సూరత్ పార్శీలు ప్రత్యేక పథకాలు తలపెట్టడం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.

జీవన వ్యయం.. మారిన ఆలోచనలు

ఆధునిక నగరాల్లో జీవనం సాగించడం అంటే మాటలు కాదు. స్కూల్ ఫీజులు, ఇళ్ల అద్దెలు, వైద్య ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలను పెంచడం ఒక పెద్ద ఆర్థిక సవాల్‌గా మారుతోంది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ, కేవలం ఒకరిద్దరు పిల్లలతో న్యూక్లియర్ ఫ్యామిలీగా బతకడానికే నేటి తరం మొగ్గు చూపుతోంది. ఇక ఈ ఆర్థిక ఒత్తిళ్ల వల్లే కుటుంబ పరిమాణం చిన్నదిగా మారిపోతోంది.

కమ్యూనిటీల ఉనికికే ముప్పు

దేశవ్యాప్తంగా జనాభా పెరుగుదల గురించి చర్చ జరుగుతున్నప్పటికీ, కొన్ని చిన్న కమ్యూనిటీల పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. ఉదాహరణకు, కచ్ కడ్వా పాటిదార్ సమాజ్ జనాభా కేవలం 17 వేలకు పడిపోయింది. ఇలాంటి సూక్ష్మ సామాజిక వర్గాలలో జనాభా తగ్గుతూపోతే, భవిష్యత్తులో వారి ప్రత్యేక సంస్కృతి, ఆచారాలు, సాంప్రదాయాలు కనుమరుగైపోయే ప్రమాదం ఉంది.

సంతానోత్పత్తిపై ఆర్థిక ప్రోత్సాహకాలు

తమ సామాజిక వర్గ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఈ కమ్యూనిటీలు ఇప్పుడు సరికొత్త దారులు వెతుకుతున్నాయి. దంపతులు మూడో బిడ్డకు జన్మనిస్తే సన్మానించి రూ. 50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని పాటిదార్ సమాజ్ ప్రకటించింది. అలాగే సూరత్ పార్శీ పంచాయత్ కూడా మూడో బిడ్డకు 25 ఏళ్లు వచ్చే వరకు నెలకు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. జనాభాను పెంచేందుకు సంఘాలే నేరుగా రంగంలోకి దిగడం గమనార్హం.

ఆధునికత వర్సెస్ సంప్రదాయాల పోరు

ఒకవైపు వ్యక్తిగత స్వేచ్ఛ, కెరీర్, ప్రశాంతమైన చిన్న కుటుంబం అనే ఆధునిక భావనలు బలపడుతుంటే, మరోవైపు వంశాభివృద్ధి, కమ్యూనిటీ ఉనికిని కాపాడుకోవాలనే సాంప్రదాయ ఒత్తిడి ఎదురవుతోంది. ఇక ఈ రెండింటి మధ్య నలిగిపోతున్న నేటి యువతను మూడో సంతానం వైపు ఆకర్షించడం అంతసులువైన విషయం కాదు. ఆర్థిక సాయాలతోనే పరిష్కారం కాకపోవచ్చు.

భవిష్యత్తు తెచ్చే మార్పులు

పట్టణీకరణ తెచ్చిన మార్పుల వల్ల చిన్న కుటుంబాల సంస్కృతి మరింత వేగంగా విస్తరిస్తోంది. అయితే చిన్న కమ్యూనిటీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి చేస్తున్న ఈ ప్రయత్నాలు రాబోయే రోజుల్లో ఎలాంటి ఫలితాలను ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది. ఆర్థిక సాయాలు ఏ మేరకు జనాభాను పెంచుతాయో కాలమే సమాధానం చెప్పాలి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 19.10.2026
www.mudranews.in | @mudranews

కూరగా, ఫ్రైగా.. రుచికరమైన వంటకం!

వట్టి తునకలను టమాటా, ఉల్లిపాయలు, గోంగూర వంటి పదార్థాలతో కలిపి కూరగా వండుకోవచ్చు. ఫ్రై రూపంలోనూ తినవచ్చు. అయితే వండే ముందు మాంసం పూర్తిగా ఉడికేలా చూసుకోవాలి.



మలేషియాలో ఘనంగా మైటా 13వ గ్రాండ్ బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు విదేశీ గడ్డపై ఘనంగా పట్టం
కౌలాలంపూర్‌లో ఆటపాటలతో అలరించిన తెలంగాణ ఆడపడుచులు



ముద్ర, కౌలాలంపూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ మలేషియా తెలంగాణ అసోసియేషన్ (మైటా) ఆధ్వర్యంలో 13వ గ్రాండ్ బతుకమ్మ వేడుకలు–2026 ఘనంగా నిర్వహించారు. కౌలాలంపూర్‌లో జరిగిన ఈ వేడుకల్లో తెలంగాణకు చెందిన ప్రవాసులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. తెలంగాణ పల్లె సంస్కృతి, జానపద కళలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ప్రముఖుల హాజరుఈ కార్యక్రమానికి భారత హైకమిషన్ కౌలాలంపూర్ ఫస్ట్ సెక్రటరీ (కాన్సులర్, పాస్‌పోర్ట్, వీసా) రాజేష్ హెచ్. మణియిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ జానపద నృత్య కళాకారిణి జనుల్యారి, జానపద గేయ రచయిత, గాయకుడు దిలీప్ దేవ్‌గన్, సినిమాటోగ్రాఫర్ అరుణ్ కొలుగూరి తమ కళా ప్రదర్శనలతో వేడుకలకు మరింత శోభ తీసుకొచ్చారు. మలేషియాలోని వివిధ భారతీయ సంఘాల ప్రతినిధులు పాల్గొని తెలంగాణ సంస్కృతిని ఆస్వాదించారు.తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ప్రత్యేక ఆహార కేంద్రాలను ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. జీఆర్‌పీసీ మలేషియా ఎన్‌డీఎన్ బీహెచ్‌డీ, రాపిన్నో టెక్ ఎన్‌డీఎన్ బీహెచ్‌డీ సంస్థలు స్పాన్సర్లుగా సహకరించగా, ఎంవై81 హైదరాబాద్ దమ్ బిర్యానీ రెస్టారెంట్ ఆహార స్పాన్సర్‌గా వ్యవహరించింది.అధ్యక్షుడు సైదం తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహణమైటా అధ్యక్షుడు సైదం తిరుపతి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. ఉపాధ్యక్షుడు చిరుత చిట్టిబాబు, మహిళా అధ్యక్షురాలు కిరణ్మయి దండెబోయిన, ప్రధాన కార్యదర్శి సందీప్ గౌడ్, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ రావు నడిపెల్లి, కోశాధికారి సందీప్ కుమార్ లగిశెట్టి, సంయుక్త కోశాధికారి సుందర్ రెడ్డి మోర్తాల, యువజన విభాగం అధ్యక్షుడు సంతోష్ దాసరాజు, ఉపాధ్యక్షుడు పోలాది శివతేజతో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.కార్యక్రమానికి సహకరించిన స్పాన్సర్లు, ముఖ్య అతిథులు, కళాకారులు, వాలంటీర్లు, వివిధ సంఘాల ప్రతినిధులకు మైటా నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలను మలేషియాలో కొనసాగిస్తూ, భావితరాలకు తెలంగాణ వారసత్వాన్ని పరిచయం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.“మన బతుకమ్మ – మన సంస్కృతి – మన తెలంగాణ – వన్ మైటా” అనే సందేశంతో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

పండుగ బస్సుల నిర్వహణలో లోటుపాట్లు లేవు

హరీశ్‌రావు ఆరోపణల్లో వాస్తవం లేదు
దసరాకు 7 వేల అదనపు బస్సులు ఏర్పాటు
మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతోంది
టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం



ముద్ర, హైదరాబాద్: పండుగల సందర్భంగా బస్సు ఛార్జీల పెంపు, ప్రత్యేక సర్వీసుల రద్దుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు చేసిన ఆరోపణలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఖండించింది. ఆయన సామాజిక మాధ్యమాల్లో చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేసింది. పండుగల సమయంలో టికెట్ ధరల నిర్ణయం 2003 నాటి ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనల ప్రకారమే జరుగుతోందని తెలిపింది.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతోందని, మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. దసరా సందర్భంగా బస్సు సర్వీసులను తగ్గించలేదని, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా 7 వేల అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.ఈ నెల 10వ తేదీ నుంచి ఇప్పటివరకు కేటాయించిన అదనపు బస్సుల్లో 97 శాతం సర్వీసులను విజయవంతంగా నడిపినట్లు వివరించింది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపింది. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన రవాణా సేవలు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేసింది.

పండుగల వేళ తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఉండొద్దు

నవంబర్ 1 నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలు
అదనంగా 500 ట్యాంకర్ల నమోదుకు చర్యలు
జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశాలు



ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 18: పండుగల సందర్భంగా నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయాలు, సీవరేజ్ పొంగిపొర్లే సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం జలమండలి ఉన్నతాధికారులతో జూమ్ ద్వారా నిర్వహించిన సమీక్షలో నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, శుద్ధి కేంద్రాల పనితీరు, రానున్న వేసవి కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు.పండుగల సమయంలో ప్రధాన రహదారులు, ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు, మురుగునీటి పైప్‌లైన్లను ముందస్తుగా తనిఖీ చేయాలని సూచించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. నిర్మాణ పనులు, ఉద్యానవనాల నిర్వహణకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించేలా నవంబర్ 1 నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ 20 నాటికి ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థను సిద్ధం చేసి ప్రయోగాత్మకంగా పరిశీలించాలని సూచించారు.మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో నీటి నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, లోపాలను నెల రోజుల్లో సరిదిద్దాలని ఆదేశించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సుమారు 1,200 ట్యాంకర్లకు అదనంగా మరో 500 ట్యాంకర్లను నమోదు చేయాలని సూచించారు. బోడుప్పల్ ప్రాంతంలో పెండింగ్ బుకింగ్‌ల పరిష్కారానికి ప్రత్యేకంగా 50 ట్యాంకర్లను సమకూర్చాలన్నారు.రానున్న వేసవి అవసరాల దృష్ట్యా ఫుట్‌కేసర్, కీసర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని సూచించారు. పంపింగ్ స్టేషన్లలో విద్యుత్ అంతరాయాలు, ప్రధాన పైప్‌లైన్లలో లీకేజీల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ప్రతిరోజూ సిబ్బందితో సమీక్షించి క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు శుద్ధి చేసిన నీటి పునర్వినియోగాన్ని పెంచాలని అశోక్ రెడ్డి స్పష్టం చేశారు.

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ ఈటల



ముద్ర, జవహర్ నగర్: దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ చంద్రపురి కాలనీ, అరుంధతి నగర్ లో ఉన్న సాయిబాబా దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హాజరై, దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. నవరాత్రుల సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తి, సేవాభావం, సామాజిక ఐక్యత పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, చంద్రపురి కాలనీ 2వ డివిజన్ బీజేపీ అధ్యక్షులు శ్రీ కర్లపూడి జోగారావు, కమల్, మేడ్చల్ రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు శ్రీ మహేందర్ యాదవ్, శ్రీ వేపుల సన్నీ, శ్రీ రఘురాం చారి, శ్రీ మల్లికార్జున గౌడ్, శ్రీ మహేష్ గౌడ్, శ్రీ శివ కేశవ్ తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో సద్దుల బతుకమ్మ వేడుకలు



ముద్ర, కూకట్‌పల్లి: తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు దంపతులు, యామిని పాల్గొని సందడి చేశారు.మహిళలు సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాంప్రదాయ పాటలు, కోలాటాలు, ఆటపాటలతో వేడుకల ప్రాంగణం అంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని, మన సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

సైబరాబాద్ లో వీకెండ్ స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్

320 మందిపై కేసులు



ముద్ర, శేరిలింగంపల్లి: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ఏడీసీపీ అడ్మిన్ జి నరేందర్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈ డ్రైవ్‌లో భాగంగా 320 మందిని అదుపులోకికేసులు నమోదు చేశారు. 265 ద్విచక్ర వాహనదారులు, 16 ఆటోలు, 38 కార్లు, 01 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఏసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —266 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 38 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, –16 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత –2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారంలో 196 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. 100 మందికి జరిమానా, జైలు శిక్ష, 05 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 191 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

శిల్పారామం లో సద్దుల బతుకమ్మ సందర్భంగా నృత్య ప్రదర్శనలు



ముద్ర, శేరిలింగంపల్లి : శిల్పారామం మాదాపూర్ లో సద్దుల బతుకమ్మ పండుగ రోజు పురస్కరించుకొని శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి సాయంత్రం బతుకమ్మ ఆటను సందర్శకులతోటి ఆడుకున్నారు. భువనేశ్వర్ నుండి విచ్చేసిన శ్రీమతి రోజ్లిన్ మోహాపాత్ర తన శిష్య బృందం చే ఒడిసి నృత్య ప్రదర్శనలో భో శంభో, జనసమ్మోహినీ పల్లవి, యుగే యుగే జగన్నాధ్ అంశాలను అనుష్క, సలోని, అర్పితా, పల్లవి, సాయి స్నేహ, సాయి శ్రాధ లు ప్రదర్శించి మెప్పించారు. కూచిపూడి నృత్య ప్రదర్శన లో కుమారి యశస్వినీ శ్రీ బృందం "త్రిదేవి " కూచిపూడి నృత్య రూపకం ఆద్యంతం అలరించింది. లక్ష్మి , పార్వతి సరస్వతి దేవి లు దుష్ట శిక్షణ కావించటానికి దుర్గ అమ్మవారిగా అవతరించడం కళ్ళకు కట్టినట్లు గ ప్రదర్శించారు. పాల్గొన్నవారు, లక్ష్మి ప్రియా, కార్తీక, దీప, అనూష, జోషిత హోసిని మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఓ ఉక్కుపాదం

పండుగ రద్దీ నేపథ్యంలో కుకట్‌పల్లిలో విస్తృత తనిఖీలు
భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
అసిస్టెంట్ ఆర్టీఓ అన్నపూర్ణ హెచ్చరిక



ముద్ర, కుకట్‌పల్లి: దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా కుకట్‌పల్లి రవాణా శాఖ అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని అధిక ఛార్జీలు వసూలు చేయడం, భద్రతా ప్రమాణాలను పాటించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై దృష్టి సారించారు. అసిస్టెంట్ ఆర్టీఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.బస్సుల్లో అత్యవసర ద్వారాలు, అగ్నిమాపక పరికరాలు, అద్దాలు పగలగొట్టేందుకు అవసరమైన హ్యామర్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పలు బస్సులను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రతి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణికుల భద్రతకు అవసరమైన పరికరాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. రాత్రివేళ సుదూర ప్రాంతాలకు ప్రయాణించే బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు ఉండాలని, అలసట లేదా అనారోగ్యానికి గురైనప్పుడు ప్రత్యామ్నాయ డ్రైవర్ బాధ్యతలు చేపట్టేలా చూడాలన్నారు. డ్రైవర్లు ప్రయాణానికి 24 గంటల ముందు నుంచి మద్యం సేవించరాదని హెచ్చరించారు.ప్రయాణికులు బస్సు ఎక్కే ముందే భద్రతా ఏర్పాట్లను పరిశీలించుకోవాలని, ఏవైనా లోపాలు గుర్తిస్తే వెంటనే రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే ట్రావెల్స్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నపూర్ణ హెచ్చరించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 19.10.2026
www.mudranews.in | @mudranews

నిల్వ విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి!



మాంసానికి ఉప్ప, పసుపు అద్ది ఎండబెట్టడం గ్రామీణ ప్రాంతాల్లో అనుసరించే సంప్రదాయ పద్ధతి. అయితే ఎండబెట్టడం వల్ల మాత్రమే మాంసం సురక్షితమవుతుందని భావించకూడదు. పరిశుభ్రంగా తయారుచేసి, సురక్షితంగా నిల్వ చేయాలి. ఉప్ప ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పరిమితంగా తీసుకోవడం మంచిది.

ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పనే



కరీంనగర్ తీగల బ్రిడ్జి వద్ద బతుకమ్మ నిమజ్జనాలు

ముద్ర, కరీంనగర్ : కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో ముస్తాబు చేసిన బతుకమ్మలను గ్రామ కూడలిలో ఉంచి మహిళలు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. 'ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పనే' అంటూ చప్పట్లు చరుస్తూ లయబద్ధంగా పాటలు పాడారు. చిన్నాపెద్దా తేడాలేకుండా మహిళలంతా వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సంబరాలు బతుకమ్మల నిమజ్జనంతో వేడుక ముగిసింది. కరీంనగర్ నగరంలో ఎమ్మెల్యే గంగుల కమాలకర్, మేయర్ కొలగాని ఏర్పాట్లు చేశారు. మహిళలు ఆటపాటలతో వేడుకలను చేసుకున్నారు.

హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

***మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మంత్రి పొన్నం ప్రభాకర్**
***సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని గౌరమ్మను ప్రార్థించాలనీ మహిళలను కోరిన మంత్రి**

ముద్ర, హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మహిళలు, ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడుతూ పండుగ సంబరాల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గౌరమ్మను పూజిస్తూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకోవాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ఆందోళన ఉందని, మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ వ్యవసాయానికి అవసరమైన సమృద్ధి వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సంతోషంగా జీవించాలని గౌరమ్మను ప్రార్థించాలని సూచించారు.

బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ తమ కుటుంబ సభ్యుల శ్రేయస్సును కోరుకునే మహిళలు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాగుండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కూడా ప్రార్థించాలని అన్నారు. రంగురంగుల పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలు, ఆడపడుచులు అందరూ కలిసి ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులు, మహిళలు, ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ లో బతుకమ్మ ఘాట్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

*** బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకన్న మంత్రి పొన్నం ప్రభాకర్**
*** చిగురుమామిడిలో దుర్గమాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం...**

ముద్ర చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్ ను రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు.చిగురుమామిడి మండల కేంద్రంలోని దుర్గామాత వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ తో కలిసిప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ అంటే కేవలం పూల పండుగ కాదు,ఇది మన తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని,తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతకు,మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం బతుకమ్మ అని అన్నారు.తొమ్మిది రోజుల పాటు తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మను ఆడి పాడుతారు.ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ" అని అన్నారు.దీపావళి పండుగ నాటికి మండలంలోని ప్రతి గ్రామానికి హైమాక్స్ లైట్లు మంజూరు చేస్తానాని,గ్రామాల్లో రాత్రి వేళల్లో చీకటి ఉండకుండా, ప్రజల భద్రత కోసం,పండుగ వెలుగుల కోసం ప్రతి గ్రామానికి హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తాం అని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు సర్పంచ్ మార్క రాజ్ కుమార్ గౌడ్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందె సురేష్, చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,ఉపసర్పంచ్ బింగి రాజేంద్రప్రసాద్,గ్రామపంచాయతీ వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ తల్లి విగ్రహావిష్కరణ..

*** హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవం..**
*** ముఖ్యఅతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుప తిరెడ్డి,సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి..**

ముద్ర చిగురుమామిడి :తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేళ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామం ఒక అద్భుతమైన ఘట్టానికి వేదికైంది.గ్రామ ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయి.సుందరగిరి గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో దాతల ఉదార సహాయ సహకారాలతో ఊర చెరువు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ తల్లి విగ్రహాన్ని గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డిలు హాజరై వైభవంగా ఆవిష్కరించారు. మహిళలు బతుకమ్మ ఆడే చెరువు వద్ద వెలుగులతో నింపేందుకు నూతనంగా



కరీంనగర్ తీగల బ్రిడ్జి వద్ద బతుకమ్మ సంబరాలు

ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కూడా ఇదే శుభసందర్భంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మన గ్రామ సంస్కృతిని కాపాడుకుంటూ,అందరి సహకారంతో ఈ విశేష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమానికి అన్ని రకాలుగా సహకరించి,పెద్ద ఎత్తున తరలివచ్చి,విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో పాలకవర్గము ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేయడంతో మహిళలు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెడబోయిన రాజు,గ్రామ వార్డు సభ్యులుగిరబోయిన రవీందర్,శ్రీమూర్తి శ్రీనివాస్ ,పెసరు ప్రమీల శ్రీనివాస్,పెసరు రాధాకృష్ణ,మంతెన ప్రియాంక మహేందర్,కావాటి మంజుల అనిల్,విరాళాలు అందించిన దాతలు,వివిధ సంఘాల నాయకులు,ముఖ్యంగా మహిళలు,గ్రామ ప్రజలందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



కొండాపూర్ లో



సుందరగిరిలో



పరమత సహనానికి నిదర్శనం మహాదేవపూర్

దసరా ఉత్సవాన్ని నిర్వహిస్తున్న హసీనా అక్బర్ ఖాన్



మహాదేవపూర్, ముద్ర: ప్రతి ఏటా మండల కేంద్రం లో దసరా ఉత్సవం అంగరంగ వైభవంగా భారీ బడ్జెట్ తో గత దశాబ్దకాలంగా నిరంతరాయంగా కొనసాగు తున్నది. గత ఎన్నికలలో సర్పంచ్ గా శ్రీమతి హసీనా భాను అక్బర్ ఖాన్ ఎన్నికయ్యారు. చాలాకాలంగా కొనసాగుతున్న దసరా ఉత్సవాలను ముందుండి నడిపించే భారాన్ని హసీనా అక్బర్ ఖాన్ లు భుజానికెత్తుకున్నారు. యువకులు, వార్డు సభ్యులు, గ్రామప్రముఖులు, వ్యాపారస్తులు వీరికి మద్దతుగా నిలిచారు. కూరగాయల మార్కెట్ లో అమ్మవారిని సకల కులవృత్తులవారు సంప్రదాయ పూజలు నిర్వహించిన అనంతరం జమిడికలతో గుండెలదిరే డప్పుచప్పుల్లతో, డీజే కోలాటాలతో వేలాదిమంది ఊరేగింపుగా గడి మైసమ్మ వద్దకు బయలుదేరుతారు. హనుమంతుని జండాను ఆవిష్కరించిన అనంతరం మైసమ్మ వద్ద పట్నాలు వేసి, బలులను సిద్ధం చేస్తారు. సీమోల్లంఘన కార్యక్రమంలో భాగంగా పొలిమేరలలో ఉన్న కొలిమిమర్రి వద్దకు వెళ్లి పాలపిట్ట దర్శనం చేసుకుంటారు. ప్రసిద్ధ శ్రీ వెంకటేశ్వర దేవస్థానం నుండి బయలుదేరిన రాములవారి రధం గడిమైసమ్మ వద్దకు చేరుకుని శమిపూజా అనంతరం 50 ఫీట్ల ఎత్తుతో నిర్మించిన రావణ దహనం కార్యక్రమం నిర్వహిస్తారు. బాణాసంచాను పెద్దఎత్తున పేలుస్తారు. లేజర్ లైటింగ్ తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రావణ దహనం కాగానే శమి ఆకును పరస్పరం అందజేసుకుని అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని సోసియల్ మీఫియాలో లైవ్ గా ప్రదర్శిస్తారు. పట్టణాల వచ్చిన పిల్లలు బంధువులు ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి కొత్తబట్టలతో తండోప తండాలుగా వస్తారు. మహాదేవపూర్ దసరా ఉత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని కాటారం డి ఎస్ పి ప్రత్యేక బందోబస్తు కు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇప్పటికే వీధులన్నీ కాషాయ తోరణాలతో విద్యుత్ దీపాలతో మెరిసిపోతున్నాయి.సద్దుల బతుకమ్మ కోసం ఎర్ర చెరువు వద్ద మైదానాన్ని సిద్ధం చేయటంతో పాటు విద్యుత్ దీపాలను పెద్దట్టున అమర్చారు.



బతుకమ్మ స్ఫూర్తితో జలవనరుల పరిరక్షణకు కృషి చేయాలి

నీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత.. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా


ముద్ర, హైదరాబాద్ : బతుకమ్మ పండుగ స్ఫూర్తితో ప్రకృతి, జలవనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. నీటి వృథాను అరికట్టి, భవిష్యత్తు తరాలకు సురక్షితమైన భవిష్యత్తును అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి, మహిళా శక్తికి, ప్రకృతి పట్ల ప్రజలకున్న ఆరాధనా భావానికి ప్రతీక అని పేర్కొన్నారు. తరతరాలుగా ఈ సంప్రదాయాన్ని కాపాడుకుంటున్న మహిళల సృజనాత్మకత, అంకితభావాన్ని అభినందించారు.

ఎల్‌నినో వంటి వాతావరణ పరిణామాల నేపథ్యంలో ప్రకృతి పరిరక్షణ ప్రాధాన్యం పెరిగిందని, ఈ ఏడాది తక్కువ వర్షపాతం భవిష్యత్తులో నీటి సంక్షోభంపై హెచ్చరికగా



భావించాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, చెరువులను పరిరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రస్తుత నీటి లభ్యతకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు చేసుకోవాలని రైతులకు సూచించారు. అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే



పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. జల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ, నవరాత్రి, విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్.. అమ్మ గౌరీ అనుగ్రహంతో ప్రతి ఇంటా సుఖశాంతులు, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

చైనా ఏజెంట్లకు దేశ రహస్యాలు

ముద్ర, న్యూఢిల్లీ : ఆర్మీ అధికారి భార్యే దేశ రహస్యాలను చైనా ఏజెంట్లకు చేరవేస్తున్నట్లు ఆరోణలు కలకలం రేపుతున్నాయి. ఓ సీనియర్ ఆర్మీ అధికారి భార్య విదేశీ నిఘా సంస్థలకు చెందిన వ్యక్తులతో సంబంధాలు కొనసాగిస్తూ వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్న సమాచారాన్ని చేరవేసినట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. నిందితురాలు తెలంగాణకు చెందిన వ్యక్తి అని ఆమె ప్రస్తుతం జమ్మూలోని గాంధీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నట్లు సమాచారం.

విద్యావేత్తల ముసుగులో పరిచయం!

ప్రాథమిక దర్యాప్తు వివరాల ప్రకారం.. కొందరు చైనా నిఘా సంస్థలతో సంబంధాలున్న వ్యక్తులు విద్యావేత్తలుగా పరిచయం చేసుకుని సదరు ఆర్మీ అధికారి భార్యను సంప్రదించినట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. తొలుత పర్యావరణం, భౌగోళిక రాజకీయాలకు సంబంధించిన అంశాలపై వ్యాసాలు రాయాలని ఆమెను కోరారు. ఆ తర్వాత క్రమంగా రక్షణ రంగానికి సంబంధించిన అంశాలపై రచనలు చేసేలా ప్రోత్సహించినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. తనను సంప్రదించిన వారు



నిజమైన విద్యావేత్తలని భావించిన ఆర్మీ అధికారి భార్య.. వారి అసలు ఉద్దేశాన్ని గుర్తించలేకపోయి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో ఆమెను మేధోపరమైన వలలోకి దించి, వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్న సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన పత్రాలు, ఫోటోలు, ఎలక్ట్రానిక్ డేటాను ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ ఛానెళ్ల ద్వారా విదేశీ ఏజెంట్లకు చేరవేసినట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ వ్యవహారంలో చైనాతో పాటు ఇతర విదేశీ దేశాలకు చెందిన వ్యక్తుల ప్రమేయం ఉందనే అనుమానాలను కూడా పోలీసులు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అయితే, ఏయే పత్రాలు సేకరించారు? ఎవరెవరితో సంబంధాలు కొనసాగించారు? ఎంత మేరకు సమాచారం బదిలీ అయింది? అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ఈ వ్యవహారంపై జమ్మూలోని గాంధీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 290/2026 నమోదు చేశారు. అధికారిక రహస్యాల చట్టం, 1923లోని సెక్షన్లు 3, 5తో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 152, 61(2) కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది. మహిళకు విదేశీ వ్యక్తులతో పరిచయం ఎలా ఏర్పడింది? వారి మధ్య ఎలాంటి సమాచార మార్పిడి జరిగింది? ఆమె వద్ద నుంచి ఏవైనా కీలక పత్రాలు లేదా ఎలక్ట్రానిక్ ఆధారాలు స్వాధీనం చేసుకున్నారా? అనే అంశాలపై దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై పోలీసులు మరిన్ని వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 19.10.2026
www.mudranews.in | @mudranews

అనారోగ్యం నుంచి కోలుకోవడానికి తోడ్పాటు

మాంసంలోని ప్రొటీన్లు, విటమిన్ బి12, ఇతర పోషకాలు శరీరానికి అవసరమైన పోషణను అందిస్తాయి. అనారోగ్యం నుంచి కోలుకునే సమయంలో సమతుల్య ఆహారంలో భాగంగా వీటిని తీసుకోవచ్చు.



కనుల పండువగా సహస్ర కుంకుమార్చన

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పద్మావతి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, పంచామృతాలతో అభిషేకం గావించారు. అనంతరం ధైర్యలక్ష్మి అమ్మవారిని అష్టలక్ష్మి మంటపంలో కొలువుదీర్చారు.శ్రీ సూక్త హవనం జరిపి పూర్ణాహుతి గావించారు. అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి అష్టలక్ష్మి మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు.దసర శరన్నవరాత్రోస్థవాల్లో భాగంగా ధైర్యలక్ష్మి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు విశేషంగా నిర్వహించారు.

- ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి



ఘనంగా బతుకమ్మ వేడుకలు



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 18 : పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ కుటుంబాల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక అయిన ఈ వేడుకలను పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఆయన సతీమణి నిష్టాశర్మ గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి ఘనంగా ప్రారంభించారు. పోలీస్ కుటుంబాలకు చెందిన మహిళలు వివిధ రకాల పూలతో రంగు రంగుల బతుకమ్మలను ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. పెద్ద సంఖ్యలో మహిళలు బతుకమ్మలను ఒకచోట చేర్చి, సాంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలతో ఆనందోత్సవాల మధ్య ఈ వేడుకను జరుపుకున్నారు. మహిళలు భారీగా తరలిరావడంతో పరేడ్ గ్రౌండ్స్ అంతా బతుకమ్మ కోలాహలంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీలు సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో..



తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ బంధానికి, రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను టీడీపీ కార్యాలయ ప్రాంగణంలో మహిళా కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సంబరాలలో ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను కన్నులపండువగా పేర్చి, గౌరమ్మను కొలువుదీర్చారు. పసుపు, కుంకుమలు, సుగంధ పుష్పాలతో గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వివిధ రకాల నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. ఆ గౌరమ్మ తల్లి దివ్య ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు, మహిళలు ఆకాంక్షించారు. అనంతరం మహిళలందరూ బతుకమ్మల చుట్టూ చేరి కోలాటాలు, బతుకమ్మ పాటలతో సందడి చేశారు.

ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్ 18: ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఏన్కూరు నుండి నాచారం వరకు రూ. 44 కోట్లతో నిర్మించనున్న అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయ బీటీ రోడ్డు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌లతో కలిసి పాల్గొన్న డిప్యూటీ సీఎం, అంతకుముందు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ భక్తుల రవాణా సౌకర్యార్థం ఈ రోడ్డును విస్తరిస్తున్నామని, దీనివల్ల స్థానికంగా వ్యాపారాలు, ఆదాయ వనరులు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో ఆలయాల



అభివృద్ధికి రూ. 2,500 కోట్లు వెచ్చిస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి నదీ పరివాహక ఆలయాలకు మరో రూ. 2 వేల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. భద్రాచలం ఆలయానికి రూ. 276 కోట్లు, బాసర పుణ్యక్షేత్రానికి రూ. 354 కోట్లు మంజూరు చేశామన్నారు.రాష్ట్రంలో కోటి 6 లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు. మహిళా సంఘాలకు 5 ఏళ్లలో లక్ష కోట్ల రూపాయల రుణాలు ఇవ్వడమే లక్ష్యమని చెబుతూ, ఈ సందర్భంగా రూ. 3.38 కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కును అందజేశారు. నవంబర్ 19న 'ఇందిరమ్మ భీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, సీపీ సునీల్ దత్, సుడా చైర్మన్ దుర్గాప్రసాద్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆయుధాలు, వాహనాలను జాగ్రత్తగా వినియోగించాలి

ఎస్పీ అక్షాన్ష్ యాదవ్
జిల్లా పోలీస్ శాఖలో
ఆయుధ, వాహన పూజలు

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ఆయుధాలు, వాహనాలను జాగ్రత్తగా వినియోగిస్తూ ఆరోగ్యంగా, ఆనందంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అన్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డి ఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ, వాహన పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ విధుల్లో ఆయుధాలు, వాహనాలు ఎంతో కీలకమైనవని, వాటిని ఎల్లప్పుడూ అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలు, ఇబ్బందులు





తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని తెలిపారు.పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఆనందకరమైన వాతావరణంలో విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు.దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు తీసుకురావాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీలు లక్ష్మీనారాయణ, వినోద్ డీఎస్పీలు శ్రీనివాస్ నాయుడు, సురేష్ సీఐ చంద్రబాబు, ఆర్ఐలు శ్రీనివాస్ నాయుడు, లతీఫ్‌ఉద్దీన్, ఎస్ఐ లు ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులపై సాయినాథుని ఆశీస్సులు ఉండాలి

పత్రికల ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలి
ఆలయ కమిటీ చైర్మన్
మంచికంటి ధనంజయ

ముద్ర, దేవరకొండ:చింతపల్లి మండల కేంద్రంలో కొలువుదీరిన సాయినాథుని 108వ పుణ్యతిథి ఉత్సవాలు, శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా జర్నలిస్టు సోదరులకు సాయినాథుని ఆశీస్సులు అందజేశారు. ఆలయంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ, భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలను ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ అభినందించారు.జర్నలిస్టుల సేవలు అభినందనీయం.. సాయినాథుని ఆశీస్సులు అనంతం!ఈ సందర్భంగా ఆలయ కమిటీ



చైర్మన్ మంచికంటి ధనంజయ మాట్లాడుతూ.. సమాజానికి సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సాయినాథుని పుణ్యతిథి ఉత్సవాలు, శరన్నవరాత్రి వేడుకలను పత్రికల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తూ, ఆలయంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్న జర్నలిస్టు సోదరులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులోనూ ఇదే విధంగా సాయినాథుని ఆధ్యాత్మిక కార్యక్రమాలను పత్రికల ద్వారా ప్రజలకు చేరవేయాలని ఆయన కోరారు. జర్నలిస్టులందరిపై సాయినాథుని కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని, వారి కుటుంబాలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.సాయినాథుని సేవలో భాగస్వాములవుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్న ప్రతి ఒక్కరికీ బాబా ఆశీస్సులు లభించాలని ప్రార్థించారు. భక్తి, సేవ, ఆధ్యాత్మికతతో సమాజంలో సానుకూల వాతావరణాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమిరిశెట్టి వెంకటయ్య, పుల్లారెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్, కమిటీ సభ్యులు, పత్రికా మిత్రులు, తదితరులు పాల్గొన్నారు

సూపర్ ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు పకడ్బందీ కార్యాచరణ

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 18 :



రానున్న ఎనిమిది నెలల్లో సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యవసాయం, విద్యుత్, సాగు, తాగునీరు, భూగర్భ జలాల పరిరక్షణకు అధికారులు పకడ్బందీ కార్యాచరణ రూపొందించాలని ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అదనపు కలెక్టర్లు పి. శ్రీనివాస రెడ్డి, డి. వేణుగోపాల్‌లతో కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా లోటు వర్షపాతం నమోదైన మండలాలను గుర్తించి, రానున్న రోజుల్లో భూగర్భ జలాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు అంచనాలు రూపొందించి రైతులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. భూగర్భ జలాల సంరక్షణలో భాగంగా అనధికారికంగా బోర్లు వేయడాన్ని, ఆటో స్టార్టర్ల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు మినహా కొత్త బోర్లకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని, వాల్టా చట్టాన్ని తహసీల్దార్లు కఠినంగా అమలు చేయాలని తెలిపారు.భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో రబీ సీజన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేపట్టరాదని, రైతులు నష్టపోకుండా తక్కువ నీటితో పండే స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న ఖరీఫ్ పంటలను కాపాడటమే ప్రథమ ప్రాధాన్యమని, ఇందుకు అవసరమైతే ఒకటి రెండు తడులు మాత్రమే నీటిని అందించి, ఆ తర్వాత మిగిలిన నీటిని తాగునీటి అవసరాలకే పూర్తిగా వినియోగించాలని సూచించారు. భక్త రామదాసు ప్రాజెక్టు పంపుల మరమ్మతులు, ప్రాజెక్టుల గేట్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో-ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్య పెంపు, మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల వారీగా త్రీ-ఫేజ్ విద్యుత్ సరఫరా సమయాలను రైతులకు ముందే తెలియజేయాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, వీబీజీ రాంజీ పథకం ద్వారా నీటి తొట్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో చర్చించిన ఈ కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించనున్నట్లు తెలిపారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల వేతనాల తగ్గింపు అన్యాయం

కేంద్రం నిధులిస్తున్నా జీతాల్లో కోతలు ఎందుకు?
ఉద్యోగులను క్రమబద్ధీకరించకపోతే ప్రజా ఉద్యమం తప్పదు
తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 18: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల వేతనాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 1195 జారీ చేయడం అన్యాయమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ ఉద్యోగుల వేతనాల్లో కోతలు విధించడం సరికాదన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల జేఏసీ నాయకులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు.రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, కొందరి వేతనాలను రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు తగ్గించారని ఆరోపించారు. పెరుగుతున్న ధరలతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతుంటే



వేతనాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కొందరి జీతాలు పెంచి మరికొందరివి తగ్గించడం వివక్ష కాదా అని నిలదీశారు. కేంద్ర నిబంధనల ప్రకారం ఏటా 5 శాతం వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.దేశంలోని ఏడు రాష్ట్రాలు ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాయని, కాంగ్రెస్ పాలిత హిమాచల్‌ప్రదేశ్ కూడా వాటిలో ఉందని కవిత పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 30 శాతం వేతనాల పెంపుతో పాటు క్రమబద్ధీకరణకు అసెంబ్లీలో తీర్మానం చేశారని తెలిపారు. తెలంగాణలోనూ ఎన్నికల హామీ మేరకు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని, వారి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే వైద్యసేవలపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. నిరసనలకు అనుమతి ఇవ్వకపోవడం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని వేతనాల తగ్గింపు నిర్ణయాన్ని సమీక్షించాలని కోరారు. ఉద్యోగులందరికీ న్యాయం చేయకపోతే వారి తరఫున పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని కవిత హెచ్చరించారు.

దుర్గా దేవి ఆశీస్సులు అందరిపై ఉండాలి

ముద్ర, దేవరకొండ: కొండమల్లేపల్లి పట్టణం దుర్గా నగర్ కాలనీ, శ్రీ ఆంజనేయ స్వామి దుర్గామాత దేవాలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవ కార్యక్రమంలో భాగంగా.. ఈరోజు అమ్మవారు దుర్గాదేవిగా అవతరించారు. సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 19.10.2026
www.mudranews.in | @mudranews

ప్రొటీన్లతో శరీరానికి బలం



వట్టి తునకలు మేక మాంసంతో తయారుచేసే సంప్రదాయ ఎండు మాంసం వంటకం. ఇందులో ప్రొటీన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కండరాల నిర్మాణానికి, శరీర కణజాలాల మరమ్మతుకు తోడ్పడతాయి.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు









ముద్ర ప్రతినిధి, మెదక్:

జిల్లా కేంద్రంలో సద్దుల (పెద్ద) బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఆదివారం జిల్లాలో పట్టణం, ఊరు వాడల్లో బతుకమ్మ పండుగను మహిళలు జరుపుకున్నారు. గత వారం రోజులుగా తీరొక్క పూలను సేకరించి అందంగా బతుకమ్మలను తీర్చిదిద్దారు. గునుగు పూలను వివిధ రకాల రంగులతో తయారుచేసి బతుకమ్మలను పోటాపోటీగా పేర్చడం కనిపించింది. కొందరు కాగితం పూల బతుకమ్మలను సిద్ధం చేసి. గౌరమ్మ లతో ప్రధాన కూడళ్లకు తీసుకెళ్లి అక్కడ ఉంచి ప్రత్యేక పూజల అనంతరం మహిళలు లయబద్ధమైన గానంతో బతుకమ్మ పాటలను పాడుతూ గౌరమ్మను కొలిచారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయంలో ప్రకృతితో మమేకమై పూలను దేవతగా కొలవడం మహిళల ఆత్మగౌరానికి ప్రతీకగా పేర్కొనవచ్చు. మెదక్ పట్టణంలో ప్రధానంగా కోదండ రామాలయం, బాలాజీ మఠం, హౌసింగ్ బోర్డ్, ఇందిరాపురి కాలనీ, గాంధీనగర్, ఫతేనగర్, నవాబుపేట, పిట్లం బేస్, కోలిగడ్డ, ఆజంపుర, జమ్మికుంట, వెంకట్రావు నగర్ కాలనీ, సాయి నగర్ కాలనీ, బృందావన్ కాలనీ దుర్గా కాలనీలలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలు కొత్త బట్టలు బతుకమ్మ ఆటలు అనంతరం చెరువుగట్టు కాలువల వద్దకు చేరుకొని ఎంపల్ చెట్టు వద్ద బతుకమ్మల ప్రత్యేక పూజలు అనంతరం నిమజ్జనం చేశారు. ఇంటి నుండి ప్రత్యేకంగా తయారు చేసుకుని వెళ్లిన పంచి ఆరగించారు. పోయిరావమ్మా గౌరమ్మా... మళ్ళీ వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా అంటూ పాడుకుంటూ ఇంటికి చేరుకున్నారు. మెదక్ పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ కానుక రాధిక భూపతి రాజు వాళ్ళు వార్డులలో జరిగిన బతుకమ్మ సంబరాలలో మహిళలతో పాల్గొని ఆడి పాడారు. సంబరాల్లో పద్మాదేవేందర్‌రెడ్డిమాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ మాయ గంగామణి మల్లేశం, న్యాయవాదులు మాయ స్వాతి వెంకటేశం కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు. మహిళలతో కలిసి వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ సందడి చేశారు. సంప్రదాయ బద్ధంగా సాగిన వేడుకల్లో మహిళలతో మమేకమై పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. కోదండ రామాలయంలో జరిగిన బతుకమ్మ సంబరాలు, మెదక్ మండలం తిమ్మానగర్, పాపన్నపేట మండలం కుర్తివాడలో మహిళలతో కలిసి మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి బతుకమ్మ ఆటపాటలతో సంబరాల్లో పాలుపంచుకున్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వేడుకల్లో మహిళలతో మమేకమై పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. గ్రామంలో బతుకమ్మ సంబరాలు సందడిగా సాగాయి.









ఇంద్రకీలాద్రిపై వైభవంగా ఆదిదంపతుల నగరోత్సవం

ముద్ర, విజయవాడ, అక్టోబర్ 18: ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం కనకదుర్గమ్మ శ్రీ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ప్రదోషవేళ శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవం భక్తిశ్రద్ధల నడుమ కన్నులపండువగా సాగింది.శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం నగరోత్సవాన్ని ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కేరళ పంచవాద్యాలు, మహిళల కోలాటాలు, జానపద కళాకారుల నృత్యాలు శోభాయాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు రథం సెంటర్, వన్‌టౌన్ వినాయక గుడి, కెనాల్ రోడ్డు, దుర్గాఘాట్ మీదుగా ఘాట్ రోడ్డు వరకు సాగింది. విద్యుద్దీపాలు, పుష్పమాలలతో అలంకరించిన రథంపై కొలువుదీరిన ఆదిదంపతులను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయజయధ్వానాలతో పురవీధులు మార్మోగాయి.నగరోత్సవం తిరిగి ఆలయానికి చేరుకున్న అనంతరం రాజగోపురం వద్ద ఉత్సవమూర్తులకు వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఆస్థాన సేవ నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అర్చకులు, ఉద్యోగులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

మేళతాళాలు, కోలాటాల నడుమ శోభాయాత్ర దుర్గాదేవి అలంకారంలో భక్తులకు కనకదుర్గమ్మ దర్శనం









Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555